ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

ఆదివారం 18 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 122 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఎస్ఐఆర్ రద్దు చేయండి

బ్యాలెట్ పేపర్లను తిరిగి తీసుకురండి

చెన్నైలోని ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన డీఎంకే ఎంపీల సమావేశం



2



రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

కాలువలోకి దూసుకెళ్లిన బస్సు... 8 మంది మృతి

2

గనిలోకే దిగని నీకు ఆ బాధలేం తెలుసు

సింగరేణి సంక్షోభానికి కేసీఆర్ కుటుంబమే కారణం

- కార్మికులను వంచించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- సింగరేణి నిధులు సొంత జిల్లాలకు తరలించారు
- ప్రమాదాల వేళ కార్మికులను పట్టించుకోలేదు
- కేటీఆర్ 'కార్మిక గర్జన'పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఫైర్



బొగ్గుబాయి కార్మికుల కష్టాలపై అవగాహన లేని కేటీఆర్ కు వారి గురించి మాట్లాడే హక్కు లేదని లేదని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణి సంక్షోభంలోకి వెళ్లిందని, సంస్థ నిధులను సిద్ధిపేట, సిరిసిల్లతో పాటు ఇతర ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. కార్మికుల కష్టాలను పట్టించుకోని నాయకులు ఇప్పుడు గోదావరి ఖనిలో ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరమని విమర్శించారు.ఆయన 'సింగిడి'తో మాట్లాడుతూ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు.

(హైదరాబాద్ - సింగిడి)

గని ప్రమాదాలు జరిగినప్పుడు, కార్మికులు ప్రాణాలు కోల్పోయినప్పుడు బీఆర్ఎస్ నాయకులు స్పందించిన దాఖలాలు ఏమిటని ప్రశ్నించారు. భూగర్భ గనిలోకి కేటీఆర్ ఎప్పుడైనా దిగారా? కార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూశారా? అని నిలదీశారు.



ప్రమాద బాధిత కుటుంబాలకు ఏం చేశారు

ప్రగతిభవన్‌లో నిర్వహించిన అభినందన సభకు హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో జరిగిన బస్సు ప్రమాదంలో టీబీజీకేఎస్ ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్, హెడ్ ఓవర్‌మెన్ రఘువీరారెడ్డి మరణించారని మంత్రి గుర్తుచేశారు. సెంట్రల్ కమిటీ సభ్యుడు, ఎలక్ట్రీషియన్ కాల్వ శ్రీనివాస్ ఒక కాలు, ఒక చేయి కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ఆ బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలనపై కార్మికుల్లో ఆశలు

సింగరేణి కార్మికులు చైతన్యవంతులని, అన్ని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని మంత్రి అన్నారు. కార్మికులంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనపై అన్ని వర్గాల్లో ఆసక్తి ఉందని పేర్కొన్నారు.

సింగరేణి నిధులు పక్కదారి...

సింగరేణి నిధులను ఇతర ప్రాంతాలకు తరలించారన్నది తమ ప్రధాన ఆరోపణగా పేర్కొన్న మంత్రి, సిద్ధిపేట, సిరిసిల్ల, హుజూరాబాద్ ప్రాంతాల్లో సింగరేణి నిధులతో పాటు ఖనిజాభివృద్ధి నిధుల పేరిట వందల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. సంస్థ రికార్డులను పరిశీలిస్తే ఈ విషయాలు వెల్లడవుతాయని అన్నారు.కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి ఇప్పుడు వారి పక్షాన నిలిచినట్లు మాట్లాడటం కేటీఆర్‌కు తగదని విమర్శించారు. గోదావరిఖని సమావేశం తర్వాత కార్మికులు గత పరిణామాలను గుర్తుచేసుకుంటున్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.



సహజ వనరులను బాధ్యతాయుతంగా

వినియోగించుకుందాం

విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

2

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భట్టి విక్రమార్క

రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత

వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 17 (సింగిడి)

తెలంగాణ నీళ్లను

ఏపీకి తరలించే కుట్ర

2

చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు

తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ

దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ



దసరా రద్దీ..

2

విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

దసరా పండుగ పురస్కరించుకుని హైదరాబాద్ నగర వాసులు భారీ సంఖ్యలో సొంతూళ్లకు పయనమవడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి వాహనాలు పోటెత్తాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. పండుగ సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే ప్రయాణాలు ప్రారంభం కాగా, శనివారం ఉదయానికి రద్దీ మరింత తీవ్రమైంది. విజయవాడ వైపు వెళ్లే వాహనాలతో టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల్లో కొద్ది నిమిషాల్లోనే దాటాల్సిన టోల్‌గేట్‌ను దాటేందుకు గంటల సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

-హైదరాబాద్, అక్టోబర్ 17 (సింగిడి)

తెలంగాణలో భూసమగ్ర సర్వేపై

మంత్రి పొంగులేటి సమీక్ష

పలు కీలక ఆదేశాలు జారీ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు భూ రీసర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ముందు భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల హద్దులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 'రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర సర్వేను చేపట్టింది.

2

-హైదరాబాద్, అక్టోబర్ 17 (సింగిడి)



కోల్‌కతాలో దుర్గామాత మండపం వద్ద

తొక్కిసలాట

17 మంది మృతి!

కోల్‌కతాలో దుర్గామాత మండపం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో 17 మందికి పైగా చనిపోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

కోల్‌కతా (సింగిడి)

2

కోల్‌కతాలో జరుగుతున్న శరన్నవరాత్రి వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. దుర్గాదేవి మండపం వద్ద తొక్కిసలాట జరిగి 17 మంది మరణించగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగన్ ప్రాంతంలో అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. రాత్రి ఏడున్నర గంటల తర్వాత ఒక్కసారిగా వర్షం మొదలుకావటంతో భక్తులందరూ మండపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో తోపులాట జరిగి చాలా మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే కోల్‌కతా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న బంగాల్ సీఎం సువేందు అధికారి, ఆరోగ్య శాఖ మంత్రి శారదత్ ముఖర్జీతోపాటు పలువురు ఉన్నతాధికారులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మరోవైపు ఈ ఘటనపై మాజీ సీఎం మమతాబెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఏపీలో స్థానిక పోరు

రెండో రోజు భారీగా నామినేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల సందడి ప్రారంభమైంది. రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కోలాహలంగా సాగింది. నామినేషన్లకు ఇంకా ఒక్కరోజే ఉండటంతో శనివారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి.

2

ఏపీలో దంచికొడుతున్న

వానలు

తెలుగు రాష్ట్రాల్లో అక్టోబర్ 22 వరకు విస్తారంగా వర్షాలు

తెలంగాణలోని పలు జిల్లాలకు హెచ్చరిక జారీ

భారీ వర్షానికి తిరుపతి విమానాశ్రయం జలమయం, కూలిన గోడలు

రాష్ట్రంలో తీవ్ర కరవు

315 మండలాల్లో కరవు ఛాయలు



2

కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు

పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన

ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు

కూటమి కుదిరేనా.. మద్దతు దొరికేనా

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పొత్తుల కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు

- మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్ ముమ్మర చర్చలు
- సీపీఎం మద్దతు కోసం అధికారిక విజ్ఞప్తి
- కోదండరామ్ మద్దతుపైనా రాజకీయ వర్గాల్లో ఆసక్తి
- ఇండియా కూటమి ఐక్యతపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలో వేడెక్కిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రాజకీయం

2



తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పొత్తుల రాజకీయానికి తెరతీసింది. తమ అభ్యర్థులకు మద్దతు కూడగట్టేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుపుతున్నారు. సీపీఎం మద్దతు కోరుతూ ఆ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. మరోవైపు ఇండియా కూటమి ఐక్యత, వామపక్షాల వైఖరి, ఇతర పార్టీల మద్దతు అంశాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

హైదరాబాద్ బ్యూరో - సింగిడి

రాష్ట్రంలో తీవ్ర కరవు

హైదరాబాద్, అక్టోబర్ 17 (సింగిడి)

తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు



చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

కూటమి కుదిరేనా.. మద్దతు దొరికేనా

పాత్తుల కోసం కాంగ్రెస్ కసరత్తు

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో తమ అభ్యర్థులకు మద్దతు కూడగట్టడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్ తదితర నేతలు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో సమావేశమై మద్దతు కోరారు. ఎన్నికలతో పాటు ఉమ్మడి రాజకీయ కార్యాచరణపైనా చర్చించారు.

సీపీఎం వైఖరి ఏంటి?

కాంగ్రెస్ విజ్ఞప్తికి సీపీఎం సానుకూలంగా స్పందించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. అయితే మద్దతుపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. సీపీఎం కూడా తన రాజకీయ వ్యూహాన్ని పరిశీలిస్తున్న నేపథ్యంలో.. కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందా, స్వతంత్రంగా ముందుకెళ్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

కోదండరామ్ మద్దతుపై ఆసక్తి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ వైఖరి కూడా ప్రాధాన్యం సంతరించుకునే అంశం. అయితే ఈ ఎన్నికలకు సంబంధించి ఆయనతో తాజాగా సమావేశం జరిగినట్లు స్పష్టమైన సమాచారం లేదు. అధికారిక ప్రకటన వెలువడితేనే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కూటమి ఐక్యతకు పరీక్ష

భాగస్వామ్య పక్షాల మద్దతు కోసం కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రంలో ఇండియా కూటమి సమన్వయంపై చర్చకు దారితీస్తున్నాయి. సీపీఎం సహా ఇతర పార్టీల నిర్ణయాలు, కాంగ్రెస్ అభ్యర్థులకు లభించే మద్దతు ఎన్నికల రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి. పొత్తులపై ఏకాభిప్రాయం కుదురుతుందా? భాగస్వామ్య పక్షాలు ఉమ్మడిగా ముందుకెళ్తాయా? అన్నది తేలాల్సి ఉంది.

తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించే కుట్ర

చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు

తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ

దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ

గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ

హైదరాబాద్, అక్టోబర్ 17 (సింగిడి)



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి–కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి–బనకచర్ల, గోదావరి–నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి–కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధి

ఏపీలో దంచికొడుతున్న వానలు

తిరుపతి , అక్టోబర్ 17 (సింగిడి)

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అక్టోబర్ 22 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతాయని తెలిపింది. తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేయగా, శుక్రవారం కురిసిన కుండపోత వానకు తిరుపతి విమానాశ్రయం జలమయమైంది.హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం, శనివారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయి. ఈ సమయంలో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. రానున్న రోజుల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలకు కూడా ఎల్లో అలెర్ట్ వర్తిస్తుందని తెలిపింది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి తిరుపతి (రేణిగుంట) విమానాశ్రయం నీట మునిగింది. కొత్త, పాత టెర్మినళ్ల వద్ద ఉన్న గోడలు కూలిపోవడంతో వర్షపు నీరు రన్‌వే వైపు చేరింది. ప్రతికూల వాతావరణం కారణంగా విజయవాడ నుంచి తిరుపతి రావాల్సిన విమానాన్ని చెన్నైకి మళ్లించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దక్షిణ కోస్తాంధ్రపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతోనే ఈ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ నెల చివరి వారంలో బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో వేర్వేరు అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని, వాటిలో ఒకటి తుపానుగా బలపడొచ్చని అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

ఏపీలో స్థానిక పోరు - రెండో రోజు భారీగా నామినేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల సందడి నెలకొంది. కట్టుదిట్టమైన భద్రత మధ్య అభ్యర్థులు అధికారులకు నామపత్రాలు సమర్పిస్తున్నారు. తమకు అవకాశం కల్పించిన పార్టీల అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలపగా కొన్ని ప్రాంతాల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి రెబల్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. రేపు ఆఖరి రోజు కావడంతో చాలామంది అభ్యర్థులు నామపత్రాలు సమర్పించే అవకాశం ఉంది.
విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందడి కొనసాగుతోంది. నూతనంగా ఏర్పడిన 50 డివిజన్‌లో కూటమి బలపరిచిన అభ్యర్థిగా తెలుగుదేశం మైనార్టీ నాయకురాలు షేక్ ఆషా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రెబల్ అభ్యర్థిగా రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆచంట సునీత నామినేషన్ దాఖలు చేశారు. కృష్ణాజిల్లా పెడనలో మున్సిపల్ ఎన్నికల హడావిడి కొనసాగుతోంది. నామినేషన్ల సందర్భంగా కూటమి అభ్యర్థులతో పాటు వైఎస్సార్సీపీ తరపున పలువురు నామపత్రాలు సమర్పించారు. వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థిగా కటకం నాగకుమారి నామినేషన్



దాఖలు చేశారు, చైర్మన్ అభ్యర్థి కోసం ఇద్దరు నామినేషన్లు వేయగా కౌన్సిలర్ అభ్యర్థులుగా 16 మంది నామపత్రాలు సమర్పించారు. పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు మున్సిపాలిటీ వైఎస్సార్సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పైడిముక్కల దివ్య నామినేషన్ దాఖలు చేశారు. బాపట్ల జిల్లా చీరాల పురపాలక సంఘానికి రెండోరోజు పలువురు వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు. నామినేషన్ల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులతో పాటు ఒక్కరినే మాత్రమే లోపలకు అనుమతించారు. చీరాల మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్సార్సీపీ అభ్యర్థిగా ఇస్తర్ల పెర్రి, చీరాల వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ కరణం వెంకటేశ్‌తో వచ్చి నామినేషన్ వేశారు. టీడీపీ, వైఎస్సార్సీపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖపోరు జరగనుంది. రేపు కూడా పలువురు చైర్మన్ అభ్యర్థులుగా నామినేషన్లు వేయనున్నారు. పల్నాడు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రెండోరోజు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. చిలకలూరిపేట, మాచర్ల, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల మున్సిపాలిటీలతో పాటు దాచేపల్లి, గురజాల నగర పంచాయతీలకు అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలు అధికంగా ఉన్న మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు మధ్య నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. కర్నూలు మేయర్ స్థానానికి ఇవాళ ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్సీపీ అభ్యర్థిగా సుశీల నామినేషన్ వేయగా ఆమె కోడలు ప్రియాంక వైఎస్సార్సీపీ తరపున డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ప్రత్యూష తరపున ఆయన సోదరుడు ప్రశాంత్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థితో పాటు మరో స్వతంత్ర అభ్యర్థి నామపత్రాలు సమర్పించారు.
ఎమ్మిగనూరు మున్సిపల్ నామినేషన్ రెండోరోజు 42మంది వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థిగా శివన్న రఘు నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాలలో రెండోరోజూ నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. మొత్తం 154 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ నుంచి 52 , వైఎస్సార్సీపీ నుంచి 70 , బీజేపీ నుంచి నలుగురు, జనసేన నుంచి ఒకరు నామినేషన్ వేయగా ఇతరులు ఏడు, 19 మంది స్వతంత్ర అభ్యర్థులు నామపత్రాలు సమర్పించారు..
సత్యసాయి జిల్లా కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిత్వానికి మూడు పార్టీల నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు. టీడీపీ నుంచి షేక్ సమీరా, వైఎస్సార్సీపీ నుంచి అత్తార్ పర్వీన్, కాంగ్రెస్ పార్టీ నుంచి రామశ్రీలక్ష్మి నామినేషన్ పత్రాల సమర్పించారు. హిందూపురంలో మున్సిపల్ వార్డులు, చైర్మన్ పదవికి పలువురు నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నుంచి మంజునాథ్, వార్డులకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.



కోల్‌కతాలో దుర్గామాత మండపం వద్ద
తొక్కిసలాట

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. కోల్‌కతాలో దుర్గామాత మండపం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో 17 మందికి పైగా చనిపోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. కోల్‌కతాలో జరుగుతున్న శరన్నవ రాత్రి వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. దుర్గాదేవి మండపం వద్ద తొక్కిసలాట జరిగి 17 మంది మరణించగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగన్ ప్రాంతంలో అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. రాత్రి ఏడున్నర గంటల తర్వాత ఒక్కసారిగా వర్షం మొదలుకావటంతో భక్తులందరూ మండపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో తోపులాట జరిగి చాలా మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే కోల్‌కతా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న బంగాల్ సీఎం సువేందు అధికారి, ఆరోగ్య శాఖ మంత్రి శారదత్ ముఖర్జీతోపాటు పలువురు ఉన్నతాధికారులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మరోవైపు ఈ ఘటనపై మాజీ సీఎం మమతాబెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

న్యూఢిల్లీ, సింగిడి

రాజస్థాన్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణికులతో వెళ్తున్న ఓ మినీ బస్సు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కోటా జిల్లాలో శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులంతా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు. వీరు భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటు శ్యామ్ ఆలయానికి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఇందుకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐఆర్ రద్దు చేయండి

చెన్నై, సింగిడి

దేశంలో తీవ్ర వివాదాస్పదంగా మారిన ఎన్నికల నిర్వహణ విధానాలపై డీఎంకే పార్టీ పోరుబాట పట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలని, ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. చెన్నైలోని అన్నా అరివాలయంలో పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన డీఎంకే ఎంపీల సమావేశంలో నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల సంఘం పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అధికారికంగా వినతిపత్రం సమర్పించాలని పార్టీ నిర్ణయించింది. బీహార్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో నిజమైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ హడావుడిగా ఎస్ఐఆర్‌ను ఆమోదించారని డీఎంకే ఆరోపించింది. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో పాత ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈవీఎంల పనితీరుపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ.. వాటి స్థానంలో సాంప్రదాయ బ్యాలెట్ పేపర్లను పునరుద్ధరించాలని, లేదా వీవీప్యాట్ స్లిప్పులను నూటికి నూరు శాతం పూర్తిస్థాయిలో లెక్కించాలని డిమాండ్ చేసింది. ఢిల్లీలో'లెట్స్ దో తిరంగా' నిరసన ప్రదర్శనకు ముందు జాగ్రత్తగా పోలీసులు అదుపులోకి తీసుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఏఐఎస్ఏ అధినేత్రి నేహా బోరాలను తక్షణమే విడుదల చేయాలని ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. వారి ఆచూకీ తెలియకుండా, ముందస్తు సమాచారం లేకుండా నిర్బంధించడం పూర్తిగా చట్టవిరుద్ధమని, అమానుషమని విమర్శించారు. మరోవైపు, నాగపట్టినం జిల్లాలో 135 కిలోల మత్తు పదార్థాన్ని దాచిపెట్టిన కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చేతిలో అరెస్టయిన భూపాలన్ ఉదంతాన్ని ప్రస్తావిస్తూ టీవీకే పార్టీపై స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీని ప్రముఖ హాలీవుడ్ డ్రగ్ డ్రామా సిరీస్‌ను పోలుస్తూ 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని వ్యాఖ్యానించారు.

దసరా రద్దీ..

మరోవైపు, ఇదే మార్గంలోని చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం ట్రాఫిక్‌కు అదనపు ఆటంకంగా మారింది. నిర్మాణ పనుల కారణంగా వాహనాలన్నీ సర్వీస్ రోడ్డు మీదుగా నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో, ఇది వాహనాలు నిలిచిపోవడానికి మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు రంగంలోకి దిగి, టోల్‌ప్లాజా వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే క్రమంలో కొన్ని వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తున్నారు. అయినప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో రాకపోకలు నెమ్మదిగానే సాగుతున్నాయి. పండుగ ప్రయాణాలు పూర్తయ్యే వరకూ ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



గజవాహనంపై శ్రీవారు

తిరుమలలో కనులపండువగా బ్రహ్మోత్సవాలు

తిరుపతి, అక్టోబర్ 17 (సింగిడి)

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు కొలువైన తిరుమల కొండ భూలోక వైకుంఠంగా ఖ్యాతి చెందింది. శ్రీవారికి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాల పేరిట ఎప్పుడు ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. అన్నింటి కంటే బ్రహ్మోత్సవాలు ప్రత్యేకమైనవి. సాక్షాత్తు బ్రహ్మదేవుడు ప్రారంభించినవి కాబట్టే వీటికి ఆ పేరు వచ్చింది. ఈ క్రమంలోనే శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు భాగంగా ఇవాళ ఆరో రోజున మలయప్పస్వామి గజవాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వర్షం కారణంగా ఘటాటోపం కింద వాహన సేవ ముందుకు సాగింది. గజరాజులు ఎదుట నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమకోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు పుష్పక విమానంపై ఉభయ దేవేరులతో కలసి తిరువీధుల్లో మలయప్పస్వామి ఊరేగారు. పుష్పక విమానానికి అసలైన అధిపతి సంపదలకు అధిపతియైన కుబేరుడు. బ్రహ్మోత్సవాల్లో పుష్పక విమాన వాహనంపై ఉన్న శ్రీనివాసుడిని దర్శించుకోవడం వల్ల భక్తులకు దరిద్రం తొలగిపోయి, అష్టైశ్వర్యాలు, సకల సంపదలు కలుగుతాయని విశ్వాసం.



తెలంగాణలో భూసమగ్ర సర్వేపై మంత్రి
పొంగులేటి సమీక్ష

మూడు దశల్లో ఈ భూసర్వే కొనసాగుతుంది. వచ్చే నెలాఖరులోగా తొలిదశ సర్వే పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. తొలి దశలో భాగంగా ఇప్పటికే 2,720 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి అయింది. సర్వేలో భాగంగా ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయిస్తున్నాం. అనంతరం ప్రతి సర్వేనెంబర్‌కు ప్రత్యేక భూదార్ ఐడీని కేటాయిస్తున్నాం. ఆధునిక సాంకేతికతతో భూముల కొలతలు తీసుకుని డిజిటల్ రూపంలో వివరాలను భద్రపరుస్తున్నాం. ఈ వివరాలన్నింటినీ భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. ఈ మేరకు భూయజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం. పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేస్తాం. కాగా, నేలకొండపల్లి మండలం కొంగరలో 665 ఎకరాల్లో వందశాతం రీసర్వే పూర్తి అయింది' అని మంత్రి పేర్కొన్నారు.



సహజ వనరులను బాధ్యతాయుతంగా
వినియోగించుకుందాం

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 17 (సింగిడి): పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ పాల్గొని తాండూరు పట్టణంలో శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తాండూరు డీఎస్పీ నర్సింహయ్య, తాండూరు డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. ఇంద్రాచౌక్ నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమం ద్వారా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలు మరియు దేశ రక్షణలో వారు అందించిన అమూల్యమైన సహకారాన్ని ప్రజలకు తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో పాటు పోలీస్ శాఖ పట్ల గౌరవభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అదనపు ఎస్పీ తెలిపినారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకో వాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా అదనపు ఎస్పీ తెలిపారు.

సమిష్టిగా ప్రకృతి విపత్తు ఎల్‌నినోను ఎదుర్కొందాం

ప్రజా ప్రభుత్వం సలహాలు సూచనలు రైతులు పాటించాలి

శాసన సభాపతి గడ్డం ప్రసాద్ పిలుపు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 17(సింగిడి): భారత్ తో పాటు ప్రపంచ దేశాలను వణికిస్తున్న ప్రకృతి విపత్తు ఎల్‌నినో ను ప్రజలందరం కలిసి ఎదుర్కొవాలని తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసన సభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. వికారాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రోజు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్‌నినో విపత్తు, దాని ప్రభావంపై స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం దాదాపు 100 దేశాల్లో ఉందని, ఇదోక ప్రకృతి విపత్తు అని చెప్పారు. ప్రజలు, రైతులు ప్రజా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకెళ్లాలని కోరారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సాగుకు నీటిని పొదుపుగా వినియోగించు కుందామన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలని తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తోందని ఆయన అన్నారు. నిరుపేదల ఆడబిడ్డల పెళ్లిలకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. మొత్తం 97 మంది లబ్ధిదారులకు (97 లక్షల 11 వేల 252 రూపాయలు) స్పీకర్ ప్రసాద్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య చెక్కులను అందించారు. ఇందులో 58 మంది కళ్యాణ్ లక్ష్మీ లబ్ధిదారులు, 39 మంది షాదీ ముబారక్ లబ్ధిదారులు ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా ప్రజా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు, అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు అందిస్తారని, రెండు, మూడు పథకాలు అమలు చేయనున్నారని చెప్పారు. వికారాబాద్ నియోజకవర్గంతో పాటు వికారాబాద్ పట్టణం తమ హయంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ తరహాలో వికారాబాద్ టౌన్ లో శివసాగర్ చెరువును సుందరీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో వికారాబాద్ పట్టణం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తికావొస్తున్నాయని, త్వరలోనే అన్ని నిర్మాణ పనులు కూడా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అర్థ సుధాకర్ రెడ్డి గారు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్లో సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17(సింగిడి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, బీజేపీ చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ జి. పద్మ ప్రసాద్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సిమెంట్ బెంచీలతో కూడిన లారీని షామీర్‌పేట్ క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు (ఎంపీ) ఈటల రాజేందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా అవిశ్రాంతంగా ప్రజా సేవలో కొనసాగుతున్నారు. వారి స్ఫూర్తితో 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ప్రజలకు ఉపయోగపడేలా ఈ సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇవి కేవలం బెంచీలు మాత్రమే కావు, మోదీ గారి సేవా సంకల్పానికి ప్రతీక. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి" అన్నారు.

జిల్లాలోని పలు... డివిజన్లకు కాంగ్రెస్ కమిటీల ప్రకటన

జిల్లాలో కాంగ్రెస్ బలోపితానికి కృషి చేయండి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు



జవహర్ నగర్, అక్టోబర్ 17(సింగిడి): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచెర్ల, జవహర్ నగర్, చంద్రపురి కాలనీలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి డివిజన్ కమిటీలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపితం చేయడం ప్రజలతో మరింత సన్నిహితంగా పని చేయాలని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ పదవులు బాధ్యతకు ప్రతీకలని ప్రజా సేవే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం వివిధ డివిజన్ల ప్రతి నిధులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బోడుప్పల్ మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు శాంతి కోటేష్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, నూతన కమిటీ సభ్యులు ఉన్నారు. వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపితం చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. కోరుతూ పద్మ ప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వల్లూరి యాదగిరి, జి. శ్రీనివాస్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి

ప్రజల మౌలిక... వసతుల కల్పనకు కృషి చేయండి

ఎంఎంసీ కమిషనర్ కు వినతి పత్రం సమర్పణ

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య



జవహర్‌నగర్ అక్టోబర్ 17(సింగిడి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని నాగారం, జవహర్ నగర్ డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్, నాగారం డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు సిసి రోడ్లు, పారిశుద్ధ్య తదితర మౌలిక సమస్యలను పరిష్కరించే దిశగా మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కలిసి శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి పలు సమస్యలను వివరించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ కు కాలనీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వివరించి వాటిని త్వరితంగా పరిష్కరించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ, గరీబోళ్ళు ఎక్కువగా నివసిస్తున్న జవహర్ నగర్ ప్రాంతాన్ని అన్ని వైపులా అభివృద్ధి చేయాలని ముఖ్యంగా డ్రైనేజీ మంచినీరు, కరెంటు తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని తెలిపారు. నాగారం ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్య విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆలూరి సంగీత రాజశేఖర్, పల్లపు రవి, బండి నవీన్ గౌడ్ , బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నాకాబందీ నిర్వహణ

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు తనిఖీలు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 17(సింగిడి): వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల కట్టడి, రహదారి భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా జిల్లా పోలీస్ అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో 15 న రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు విస్తృతంగా నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు మూడు డివిజన్ల పరిధిలో 20 పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 36 తనిఖీ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలతో పాటు భారీ వాహ నాలను తనిఖీ చేసి, వాహనదారుల పత్రాలు, వాహనాల వివరాలను పరిశీలించారు. మొత్తం తనిఖీ చేసిన వాహనాలు: 1,677 డీడీ కేసులు: 71 ఈ-పెట్టి కేసులు: 79 నమోదు చేశారు. నాకాబందీ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగింది . వాహనదారుల ధ్రువపత్రాలు, వాహనాల వివరాలను పరిశీలిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీస్ అధికారులు నిఘా పెట్టడం జరుగుతుంది.
ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రాధాన్యత. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం తనిఖీలు, నిఘా కార్యక్రమాలు కొనసాగిస్తుంది. ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీస్ అధికారులు తెలియజేయడం జరిగింది.

పాలక వర్గానికి ప్రశంసలు



మిరుదొడ్డి, అక్టోబర్ 17(సింగిడి): మండల కేంద్రం అభివృద్ధిలో మరో ముందడుగు పడడంతో గ్రామ ప్రజల నుండి గ్రామ పంచాయతీ పాలక వర్గానికి ప్రశంసలు కురిపిస్తున్నారు. గ్రామ సర్పంచ్ ఎలుముల మహేశ్వరి దేవరాజు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్‌లో భాగంగా ఎల్ ఈ డి స్ట్రిప్ లైట్ల ఏర్పాటు చేయడం ఎంతో గర్వకార ణమని గ్రామస్థుల నుండి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.గ్రామ ప్రధాన రహదారిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, రాత్రి వేళల్లో రహదారి అందాన్ని పెంచేలా ఈ లైటింగ్ ఏర్పాటు చేయడం హర్షణీయమంటూ పౌరగడ్డలు వెలువడుతున్నాయి. గ్రామ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం మిరుదొడ్డి గ్రామానికి మరింత శోభను తీసుకురానుంది. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం కృషినీ గ్రామస్థులు అభినందిస్తున్నారు.అభివృద్ధిలో భాగంగా ఆర్టీసీ నూతన బస్టాండులో ప్రయాణీకులు కనీస అవసరాలు తీర్చుకునే విధంగా మరుగుదొడ్ల మరమ్మతులు,బస్టాండ్ ఆవరణలో సీసీ ,లైటింగ్, చిన్న చిన్న మరమ్మతులు చేసి బస్టాండ్ భవనాన్ని తీర్చిదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు.మండల కేంద్రం కావడంతో హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లడానికి పరిసర గ్రామాల ప్రజలు బస్ సౌకర్యం కోసం రావడం వల్ల బస్టాండులో ఎలాంటి సౌకర్యాలు లేక పోవడం వల్ల ప్రయాణీకులు అసౌకర్యానికి గురవుతున్నారనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. మెడల్ స్కూల్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు డివైడర్లు ఏర్పాట్ చేసి ఎల్ ఈ డి లైట్లు ఏర్పాటు చేస్తేగ్రామానికి ఎంతో శోభాయమానంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఉత్తమ గ్రామ పంచాయతీ గా తీర్చిదిద్దాలని పాలక వర్గాన్ని గ్రామస్థులు కోరుతున్నారు.

నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● గజ్వేల్ నియోజకవర్గంలో గ్రంథాలయాలను సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం



సిద్ధిపేట బ్యూరో, అక్టోబర్ 17(సింగిడి): ప్రతి గ్రామంలో గ్రంథాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమ్మ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, ఆయన సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో గ్రంథాలయాల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. జిల్లాలోని జగదేవపూర్ మండల గ్రంథాలయాన్ని శుక్రవారం రోజున సందర్శించారు. శిథిలావస్థలో పడి ఉన్న బిల్డింగ్ ను గ్రంథాలయ పరిస్థితులను పరిశీలించి కొత్త భవన నిర్మాణం కోసం కూడా ఎవరైనా దాతలు కానీ లేదా గ్రంథాలయ చెన్ బోర్డు నుండి నిర్మాణం కోసం కృషి చేస్తారని చెప్పారు. పాఠకులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.గతంలో గ్రంథాలయాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లభించకపోవడంతో యువతకు గ్రంథాలయాల ప్రాముఖ్యత తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు అందుబాటులో ఉండేలా గ్రంథాలయాలను అభివృద్ధి చేయడం అవసరమని ఆయన అన్నారు. గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, పత్రికలు, ఇతర పఠన సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలు మాత్రమే కాకుండా, యువతలో జ్ఞానం, ఆలోచనా శక్తి, సామాజిక అవగాహన పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

కీసర నూతన సీఐగా ఎలక్షన్ రెడ్డి నియామకం



కీసర అక్టోబర్ 17 (సింగిడి): కీసర పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా ఎన్. ఎలక్షన్ రెడ్డి నియమితులయ్యారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ నుండి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కీసర ఎస్ హెచ్ ఓ గా నియమితులైన ఎలక్షన్ రెడ్డి ఇదివరకు కంటోన్మెంటులో ఎస్ ఓటి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు నిర్వహించి ఇక్కడికి బదిలీ అయినట్టుగా అధికారులు తెలిపారు. కీసర ఎస్ హెచ్ ఓ గా శుక్రవారం నుండి అధికారికంగా విధులు చేపడుతున్నట్టు సమాచారం అందించారు.

అతిగా మద్యం సేవించి గుర్తు తెలియని వ్యక్తి మృతి



జవహర్ నగర్, అక్టోబర్ 17(సింగిడి): అతిగా మద్యం సేవించి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాకేత్ కాలనీ పరిసర ప్రాంతంలో అనీష్ కళాశాల ఎదురుగా సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి గత మూడు నెలలుగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాడు. అతను తరచూ మద్యం సేవించి పరిసర ప్రాంతాలు తిరుగుతూ మద్యం సేవించేవాడని ఈనెల 16వ తేదీన ఉదయం 9 గంటల 45 నిమిషాలకు స్థానిక పంక్చర్ షాప్ యజమాని తన షాపు వెనుక ఉన్న ఖాళీ స్థలంలో సదరు వ్యక్తి ఎలాంటి కదలికలు లేకుండా ఉండడానికి గమనించాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా సదరు వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడానికి గమనించి వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి అతను మరణించాడు అని ధ్రువీకరించారు. సదరు వ్యక్తి అధికంగా మద్యం సేవించడం వల్ల లేదా ఇతర కారణాలవల్ల మరణించి ఉండవచ్చునని భావించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేట్ కనకదుర్గ ఆలయంలో కనుల విందుగా దసరా వేడుకలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17(సింగిడి): నిజాంపేట సర్కిల్ నిజాంపేట్ గ్రామంలో వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రులు ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు వేద మంత్రాల మధ్య ఘనంగా దేవీ నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మూలా నక్షత్రం రోజున అమ్మవారిని రాజమాతంగి అవతారంలో దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అ-ర్చకులు సత్యం పంతులు వారికి అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేసి వారిని ఆశీర్వదించారు. మూలా నక్షత్రం శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తమ పిల్లలకు విద్యాభ్యాసం, కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారు మూలా నక్షత్రం రోజున రాజమాతంగి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని ఈరోజు అమ్మవారిని దర్శించుకుంటే తమ పిల్లలకు మంచి విద్య ఉద్యోగాలతో ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. సత్యం పంతులు మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో ముఖ్యమైనది మూలా నక్షత్రం అని ఆ నక్షత్రం శుక్రవారం రావడంతో అమ్మవారు రాజమాతంగి అవతారంలో దర్శనమిస్తుండడంతో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. మూలా నక్షత్రం రోజున బాల, బాలిక చిన్న పిల్లలకు విద్యాభ్యాసం చేపిస్తే వారికి మంచి విద్య, ఉద్యోగం రాజకీయంగా ఉన్నత స్థాయికి వెళ్తారని తెలిపారు. ఈరోజు ఆలయంలో బాల బాలి,కలకు చిన్న పిల్లలకు విద్యాభ్యాసం అర్చకులచే చేయించామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ పిల్లలకు విద్యాభ్యాసం చేయించుకున్నారని తెలిపారు. ఆలయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో అన్ని వసతులను సమకూర్చారన్నారు. శుక్రవారం నిర్వహించిన అన్న వితరణ మహోత్సవ కార్యక్రమానికి రాధాకృష్ణమూర్తి, లక్ష్మీ దంపతుల సహకరించారన్నారు. ప్రతిరోజు ఆలయ ఆవరణలో అన్నవితరణ కార్యక్రమం చేపడుతున్నామని ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న వితరణ కార్యక్రమానికి సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరన్నారు. సాయంత్రం సమయంలో అమ్మవారి ఉత్సవాల లో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన లక్ష్మి దేవి ఉత్సవ ఊరేగింపుకు, శుక్రవారం రోజు సరస్వతి అమ్మవారి ఉత్సవాలకు శ్రీనివాసరాజు సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రతి కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు.

రాంపల్లి చెరువుకు ప

ఎడిటోరియల్

Editorial

సర్టిఫికెట్ల ఫైళ్లలో భవిష్యత్తును

వెతుకుతున్న యువత..

నైపుణ్యం లేని చదువు వల్లే సమస్యా?

"నా దగ్గర 3 డిగ్రీలు ఉన్నాయి సార్.. కానీ నా జేబులో 30 రూపాయలు కూడా లేవు!" ఇది కామారెడ్డి బస్టాండ్ లో ఓ యువకుడు అన్న మాట. ఇది ఒక్కడి మాట కాదు, నేడు తెలంగాణలో లక్షలాది మంది చదువుకున్న యువతి యువకుల ఆవేదన!

అసలు సమస్య ఎక్కడ?
మనం పిల్లలకు 15 ఏళ్లు చదువు చెప్పిస్తాం. లక్షలు ఖర్చు పెడతాం. చివరకు చేతికి ఒక డిగ్రీ పట్టా ఇస్తాం. కానీ ఆ పట్టాతో ఏ కంపెనీ గేటు దాటలేని పరిస్థితి. ఎందుకు? మన చదువులో "స్కిల్"లి లేదు. కేవలం మార్కులు, మెమరీ పవర్ మాత్రమే ఉంది. కంప్యూటర్ ముందు కూర్చోమంటే భయం, ఇంగ్లీష్ లో మాట్లాడమంటే వణుకు, సొంతంగా ఒక చిన్న వ్యాపారం చేయమంటే ఆలోచనే లేదు.

సోషల్ మీడియా మాయలో యువత!

ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు రీల్స్, షార్ట్స్, లైకులు, షేర్లు. గంటల తరబడి ఫోన్ చూస్తూ, తమ విలువైన సమయాన్ని, తమ తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేస్తున్నారు. ఒక రీల్ చేయడానికి 10 సార్లు టేక్ చేసే శ్రద్ధ, ఒక ఉద్యోగ ఇంటర్వ్యూకు ప్రిపేర్ అవ్వడంలో చూపడం లేదు.

పరిష్కారం ఏమిటి?లి

ప్రభుత్వం చేయాల్సింది: డిగ్రీలతో పాటు ప్రతి కళాశాలలో తప్పనిసరిగా 6 నెలల స్కిల్ ట్రైనింగ్ (కంప్యూటర్, కమ్యూనికేషన్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, డ్రోన్ టెక్నాలజీ) ఇవ్వాలి.

యువత చేయాల్సింది:

"ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే జీవితం" అనే భ్రమ వదిలేయాలి. చేతిలో పని నేర్చుకోవాలి. శ్రమను గౌరవించాలి. చిన్నగా సొంత వ్యాపారం మొదలు పెట్టాలి.

తల్లిదండ్రులు చేయాల్సింది:

"నా కొడుకు ఇంజనీరే అవ్వాలి" అని ఒత్తిడి చేయకుండా, వాడికి ఏ పనిలో ఆసక్తి ఉందో గమనించి ప్రోత్సహించాలి. నిజమైన అభివృద్ధి అంటే భవనాలు కాదు, బతుకులు బాగుపడటం. తెలంగాణ యువత డిగ్రీలను పక్కన పెట్టి, స్కిల్స్ ను నమ్ముకుంటే, రేపు ఉద్యోగం కోసం వాళ్ళు వెతకరు, ఉద్యోగాలే వాళ్ళ కోసం వెతుకుతాయి! ఇది కేవలం నిరుద్యోగ సమస్య కాదు, మన భవిష్యత్తుకు సంబంధించిన హెచ్చరిక!

– ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
కామారెడ్డి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు,
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9440287170.



ఉపాధ్యాయుడి నుంచి ఉద్యమవీరుడిగా...

¿£\'\d<q¶<se ¢$A><,

అక్టోబర్ 18... కల్వల సదానందరావు వర్ధంతి

తెలంగాణ ఉద్యమ చరిత్రలో తమ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన మహనీయులలో కల్వల సదానందరావు పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన జీవితం వ్యక్తిగత గాధ మాత్రమే కాదు --- తెలంగాణ ఆత్మగౌరవం కోసం, రైతు సంక్షేమం కోసం, సామాజిక సమానత్వం కోసం సాగిన నిరంతర త్యాగ యాత్ర. పల్లె బాటలో పుట్టి, ప్రజా బాటలో నడచి, తెలంగాణ ఉద్యమానికి తమ ఊపిరిని అంకితం చేసిన ఆయన జీవితం స్ఫూర్తిదాయక గాధగా నిలిచి పోయింది.



నల్గొండ జిల్లా మోత్కూరు మండలంలోని కల్వల గ్రామంలో 1930ల చివరలో జన్మించిన సదానందరావు చిన్ననాటి నుంచే కష్టసాధ్య స్వభావం, ప్రజా భావం కలిగిన బాలుడు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబంలో జన్మించినప్పటికీ విద్యపై ఆసక్తి తగ్గలేదు. పట్టుదలతో చదువుకొని ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. ఆయన బోధన విద్యార్థుల మనసుల్లో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానాన్ని కాదు, ప్రజా చైతన్యం, సామాజిక అవగాహనను నింపింది. పాఠశాలలను సదుపాయాలతో తీర్చిదిద్ది, బాలబాలికల విద్యాభివృద్ధి కోసం పాటుపడిన ఆయన, బోధనను వృత్తిగా కాక ధర్మంగా చూశారు.

కానీ ఆయన మనసులో తపన ఒకటే --- తెలంగాణ ప్రజలకు న్యాయం జరగాలి. 1969లో తెలంగాణ ఉద్యమం జ్వలించినప్పుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే విద్యార్థుల్లో ఆత్మగౌరవ భావనను నింపారు. ఆత్మ నిర్ణయ హక్కు కోసం జరిగిన ఉద్యమంలో స్వయంగా పాల్గొని "తెలంగాణ హక్కులు తెలంగాణ వారికే!" అని నినదించారు. ఆందోళనల్లో ముందుండి ప్రజలను సంఘటితం చేశారు. ఉద్యమ పట్ల ఉన్న అంకితభావంతో ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఉద్యమ బాట పట్టారు. ర్యాలీల్లో పాల్గొని అరెస్టు అయ్యారు. నల్గొండ జైలులో కొన్ని నెలలు నిర్బంధంలో గడపడం ఆయన జీవితంలో ఒక గర్వకారణ ఘట్టంగా నిలిచింది.

సదానందరావు పోరాటం రాజకీయ గడపలో ఆగలేదు. ఆయనకు ప్రజాసేవే ప్రధాన ధ్యేయం. రైతు బాగుపడితే దేశం బాగుపడుతుందని నమ్మిన ఆయన సాగునీటి కొరత, విద్యుత్ లోపం, అప్పుల బాధలు, పంట ధరల సమస్యలపై రైతుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన మాటలో నిష్పాక్షికత, ధైర్యం, ఆత్మవిశ్వాసం కలిసిపోయి ఉండేవి. 1962లో మోత్కూరు గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా ఎన్నికై ప్రజా నమ్మకం సంపాదించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, నీతి, సేవా మూర్తిత్వం ఆయన పాలనకు నిర్వచనం అయ్యాయి.

మూల రేగడి (ప్రస్తుతం గోవిందా పురం) భూ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పాల్గొన్న ఆయన గ్రామ పెద్దగా స్థానిక వివాదాలు, పంచాయతీలను న్యాయంగా పరిష్కరించి ప్రజల ఆదరణ పొందారు. పోచంపాడు నదీ జలాల కోసం, భీమలింగం కాల్వ నిర్మాణం కోసం, 1982లో మోత్కూరు ప్రాంతంలో కరెంటు లోఓల్టేజీ సమస్య పరిష్కారానికై పోరాటాలు నడిపారు. సాగునీటి హక్కుకోసం ఆయన చేసిన నిరసనలు ప్రజలలో చైతన్యం రేపాయి. కాంగ్రెస్ పార్టీలో సభ్యునిగా ఉన్న ఆయన, పార్టీ లోపభూయిష్ట నిర్ణయాలపై కూడా గళం వినిపించడంలో వెనుకడుగు వేయలేదు.

1990లో రైతు సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యునిగా ఎన్నుకోబడి బొరంగాబాద్, హైదరాబాద్, వరంగల్‌లో జరిగిన అఖిల భారత రైతు మహాసభల్లో కీలక తీర్మాణాలు ప్రవేశపెట్టారు. ఆయన ఆలోచనల్లో వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామాభివృద్ధి ప్రధాన స్థానంలో ఉండేవి. తెలంగాణ రైతు సంఘం యాదాద్రి జిల్లా గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తూ రైతు సమస్యలను ప్రతీ వేదికలో ప్రస్తావించారు. రాజకీయాలు అధికారం కోసం కాక ప్రజా సాధికారత కోసం ఉండాలనే ఆయన తాత్విక దృక్పథం నేటికీ స్ఫూర్తిదాయకం.

2000 తరువాత తెలంగాణ ఉద్యమం మరోసారి ఉద్ధృతం కావడంతో వయసు పైబడినా ఆయన మళ్లీ బహిరంగ సభలకు, ర్యాలీలకు హాజరై "మా తెలంగాణ మా హక్కు" అంటూ యువతలో ఉత్సాహం నింపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజున ఆనంద భాష్పాలతో "ఇది నా జీవిత తృప్తి" అని చెప్పిన ఆయన తెలంగాణ తల్లిపట్ల ఉన్న మమకారం ఎంత లోతైనదో చాటి చెప్పారు.

2022 అక్టోబర్ 18న ఆయన ఆకస్మిక గుండెపోటుతో హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన మరణం మోత్కూరు, నల్గొండ, యాదాద్రి ప్రాంతాల్లో విషాదాన్ని మిగిల్చింది. తెలంగాణ తల్లి ఒక అంకితభావ కొడుకును కోల్పోయిందని ప్రజలు కన్నీటి నివాళులు అర్పించారు.

కల్వల సదానందరావు జీవితం తెలంగాణ ఉద్యమ చరిత్రలో నిస్వార్థ త్యాగానికి ప్రతిరూపం. ఆయన తపన, త్యాగం, సేవా ధర్మం నేటి తరానికి మార్గదర్శకం. తెలంగాణ పట్ల ఆయన చూపిన ఆరాధన, ఆత్మగౌరవం, ప్రజా ప్రేమ మనసులను కదిలించే విలువలుగా నిలిచాయి. తెలంగాణ అనే ఆలోచనను కేవలం రాజకీయ సరిహద్దుల్లో కాకుండా ప్రజా హృదయాల్లో స్థిర పరిచిన యోధులలో కల్వల సదానందరావు పేరు చిరస్మరణీయంగా నిలిచి పోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ"

నేడు కవి సామ్రాట్ వర్ధంతి



తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన బహుముఖ ప్రజ్ఞులు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవుని వేదనను ప్రతిబింబించేదే. ప్రతీ అక్షరంలోను అసాధారణ ఊహాశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి పరుగులెత్తించ గలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియ లేదు. తన రచనల ద్వారా కులాతీత, మతాతీత విధానాలను ఎండగట్టారు. ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించడం అసాధ్యం. విశ్వనాథ 1895, సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో జన్మించాడు.

తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయన భార్య వరలక్ష్మమ్మ. విద్యాభ్యాసము నందమూరు, ఇందుపల్లి, మరియు పెదపాడు గ్రామాల్లోను, పై చదువులు బందరు పట్టణంలోను సాగాయి. బందరు హైస్కూలులో తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి తెలుగు ఉపాధ్యాయునిగా లభించడం ఆయన అదృష్టం. బి.ఎ. తరువాత విశ్వనాథ బందరు హైస్కూలులోనే ఉపాధ్యాయునిగా చేరాడు. ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ. పట్టా సాధించాడు. తరువాతి కాలంలో ఈయన వివిధ కళాశాలల్లో అధ్యాపక పదవులు నిర్వహించాడు. బందరు నేషనల్ కాలేజి (1928), గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి (ఏసీ కాలేజీ) (1938 వరకు), విజయవాడ లో ఎస్.ఆర్.ఆర్.ఉ? సి.వి.ఆర్. కాలేజి (1938–1959), కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ ఉ సైన్స్ కాలేజి (1959) మొదలైన కళాశాలల్లో ఆయన పని చేసాడు. 1957 లో విశ్వనాథ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగానూ, 1958లో విధానమండలికి నామినేటెడ్ సభ్యుడుగానూ పని చేశాడు.

మహాత్మా గాంధీ నడుపుతున్న సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం ఉద్యోగాన్ని వదులు కున్నాడు. 1916 లో "విశ్వేశ్వర శతకము" తో విశ్వనాథ రచనా ప్రస్థానము ప్రారంభమైనది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆ సమయంలోనే "ఆంధ్ర పౌరుషము" రచించాడు. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చు కొన్నాడు. 1961 లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రాచార్యునిగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికే కేటాయించాడు. తరువాత విశ్వనాథ రచనా పరంపర పుంఖానుపుంఖాలుగా కొనసాగింది. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు... తెలుగుభాషకు విశ్వనాథ ఎనలేని సేవలు అందించాడు. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువదించారు. రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించాడు. విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి... ఆంధ్ర పౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో ఆయన పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన, వ్యక్తిత్వం అద్భుతంగా కనిపిస్తుంటాయి. తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు లభించినది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని అంటుండే వాడు. ఎందరో కవులు వ్రాసినా మళ్ళీ ఎందుకు



వ్రాయాలంటే రోజూ తింటున్నామని అన్నం తినడం మానివేయడం లేదుగదా అన్నాడు.

వేయిపడగలు నవలను మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు "సహస్రఫణ్" పేరుతో హిందీ లోకి అనువదించాడు. భారతీయ సంస్కృతి, ఆచారం, విశేషాలు, మధ్య తరగతి జీవన విధానాలు ఈ నవలలో విశేషంగా చూప బడ్డాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపధ్యంలో వచ్చిన నవల "ఏకవీర"ను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఏకవీర సినిమా కూడా వచ్చింది. ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చాడు. విశ్వనాథ వ్యక్తిత్వం ప్రాచీన విధానాలకు, ఆచారాలకు కట్టుబడ్డది. భారతీయత మీద, తెలుగుదనం మీద అభిమానం కలిగింది. తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను నిక్కచ్చిగా తెలిపేవాడు. ఈ కారణంగా విశ్వనాథను వ్యతిరేకించిన వారు చాలామంది ఉన్నారు.

ఛాందసుడు అనీ, "గతకాలమె మేలు వచ్చుకాలము కంటెన్" అనేవాడు అనీ (శ్రీశ్రీ విమర్శ) విమర్శించాడు. విశ్వనాథకు పాశ్చాత్య సాహిత్యం అంటే పడదని అనుకొంటారు. కాని ఆయన పాశ్చాత్య సాహిత్యం పట్ల గౌరవం కలిగి ఉండేవాడు. షేక్స్‌పియర్, మిల్టన్, షెల్లీ వంటి కవుల రచనలను ఆసాంతం పరిశీలించాడు. 1964లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ "కళాప్రపూర్ణ" తో సన్మానించింది. 1942లో గుడివాడ లో "గజారోహణం" సన్మానం జరిగింది. 1956 లో షష్టి పూర్తి వేడుకలు కూడా గుడివాడలో ఘనంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం డి.లిట్ పట్టాతో సన్మానించింది.

1962 లో "విశ్వనాథ మధ్యాక్కఱలు" రచనకు కేంద్రసాహిత్య అకాడెమీ వారి బహుమతి లభించింది. 1970 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆస్థాన కవి"గా గౌరవించింది. 1970 లో భారత ప్రభుత్వము "పద్మభూషణ పురస్కారం"తో గౌరవించింది. జ్ఞానపీఠ అవార్డు పొందిన తొలి రచయిత. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లో కూడా అనువదించారు. విశ్వనాథ చేపట్టని ప్రక్రియ కాని, ప్రయోగం కానీ లేదు. నవల, కథ , నాటిక, పాట, ఏదైనా తగిన పరిష్కారాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలి ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశాడు. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమికి ఉపాధ్యక్షుడుగా ఉన్నాడు.

విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో ఆయన పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన "రామాయణ కల్పవృక్షము" అనే పుస్తక రచనకు గాను జ్ఞాన పీఠ అవార్డు అందు కున్నారు. కోల్‌కతా, ముంబయి ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కలా పరిషత్ విశ్వనాథను "కళా ప్రపూర్ణ" బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం "పద్మభూషణ్" బిరుదుతో గౌరవించింది. ఇతర ప్రభావాలు, ప్రలోభాలు లేని విశ్వనాథ స్వాతంత్ర్య రచనా శైలిని స్పృశిస్తూ గురువు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తన శిష్యుని గురించి ఇలా అన్నాడు..."నా మార్గమ్ముకు కాదు, వీని దరయన్ నా తాత ముత్తాతలందే మార్గమ్ముకు కాదు; మార్గమది యింకేదో యసంగా వలెన్ సామాన్యుండన రాదు వీని కవితా సమ్రాట్ వవుత మా హేతువై,యీ మచ్చిష్యుని దా వరించినది, నేనెంతే ముదంబందెదన్".

కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ 1976 అక్టోబరు 18న తనువు చాలించారు. ఆ అద్భుత ప్రతిభాశాలి నడిచిన సాహితీసేవా మార్గంలో నేటి యువత చిత్తశుద్ధితో అడుగులు వేయాలని ఆశిద్దాం. సూర్యుని కాంతి, చంద్రుని వెన్నెల, కృష్ణమ్మ పరవళ్ళు, గోదారి చల్లదనం ఉన్నంతవరకు తెలుగు సాహిత్య అభిమానుల గుండెల్లో విశ్వనాథ మరియు ఆయన రచనలు చిరస్మరణీయం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

అన్నారంలో ప్రభుత్వ భూమి కబ్జా

మానకొండూర్, అక్టోబర్17(సింగిడి): మండల పరిధిలోని అన్నారం గ్రామంలో గల సర్వే నెంబర్ 502, 502-సీబీలోని ప్రభుత్వభూమిని కబ్జాచేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అట్టి రిజిస్ట్రేషన్‌ను తక్షణమే నిలిపివేయాలని అన్నారం గ్రామ బాధితులు, నిరుపేదలు ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ విజయకుమార్ కు, మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణకు శనివారం ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అన్నారం గ్రామ సర్వే నెంబర్ 502 లోని ఎకరాల 8-23 గుంటల భూమిని 1975వ సంవత్సరంలో పట్టాదారుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ భూమిలో ఎకరాల 3-16 గుంటల భూమిని 1992లో ఎమ్మెల్యే కోటా కింద గవర్నమెంట్ క్వార్టర్స్ కొరకు కేటాయించారు.ఎకరాల 3-00 ల భూమిని 2008లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ఉపయోగించారు. అయితే, ఇందులోని ఎకరాల 1-10 గుంటల ప్రభుత్వ భూమిని గొల్లపల్లి నర్సింగారావు,తండ్రి రామయ్య అనే వ్యక్తి అక్రమంగా కబ్జా చేసి, అందులో మామిడి తోట సాగు చేస్తూ, తప్పుడు మార్గాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ లో పట్టా మార్పిడి చేసుకున్నారని బాధితులు ఆరోపించారు.



దీనిపై 2012లో కరీంనగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓస్ నెంబర్ 566/2012 కేసు దాఖలు కాగా, ఐపీ నెంబర్1410/2012 ద్వారా బాధితులకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ కూడా వచ్చింది.ఇలాంటి కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తప్పుదోవ పట్టిస్తూ భూభారతి రికార్డులను ఆసరాగా చేసుకుని గొల్లపల్లి నర్సింగారావు, మందల వెంకటరాంరెడ్డి అనే వ్యక్తులు అన్నారం గ్రామంలోని సర్వే నెంబర్ 502-సీబి లో గల ఎకరాల 2-08 గుంటల భూమిని మానకొండూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.మానకొండూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న సర్వే నెంబర్ 502-సీబి కి సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే నిలిపివేయాలి అని,వివాదాస్పద సర్వే నెంబర్ 502 లోని ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేయించి, రికార్డులను సరిచేయాలి అని,సదరు ప్రభుత్వ లేఅవుట్ భూమిని

రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని గ్రామస్థుల వినతి

గ్రామంలోని ఇండ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు గొల్లపల్లి రవీందర్,రామగిరి సారయ్య, ఆరెల్లి శంకర్, ఆరెల్లి రాజు, మొలంగూరి శ్యామల, ఆరెల్లి పుష్ప, కాశపాక రమేష్, రామగిరి అంజయ్య, ఆరెల్లి అనిత, రామగిరి లక్ష్మి, రామగిరి శాంతమ్మ, రామగిరి పుష్ప, రామగిరి కొమురమ్మ, ఆరెల్లి కనుకమ్మ, ఆరెల్లి వజ్రమ్మ, ఆరెల్లి అంజలి, ఆరెల్లి అరవింద్, ఆరెల్లి సతీష్, ఆరెల్లి శివకుమార్, ఆరెల్లి అజయ్, ఆరెల్లి బాబు, ఆరెల్లి రాజయ్య, మహిళల లు, గ్రామ ప్రజలు,తదితరులు ఉన్నారు.



రైతు సేవ,అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలి



- ఏఎంసీ కొత్త పాలకవర్గానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన

మానకొండూర్, అక్టోబర్17(సింగిడి): రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం పనిచేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శనివారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ మార్కెట్ కమిటీ సేవలను మరింత విస్తరించాలని అన్నారు. రైతులకు అవసరమైన సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల రైతులకు కూడా మార్కెట్ కమిటీ సేవలు మరింత చేరువయ్యేలా పనిచేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఎంసీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ఎర్రోళ్ల కవిత, తమిశెట్టి రాజేష్, రామినేని రమణయ్య, కనకం అశోక్, రాపాక రాజేశ్వర్, కుంభం చిరంజీవి, కొత్తిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మందల సంపత్ రెడ్డి, ముక్కెర సతీష్ కుమార్, ఏ. రామాంజనేయులు, దూలం వీరస్వామి, విశ్వనాథుల వీరకుమార్ , మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, మానకొండూర్, ఊటూరు పీఏసీఎస్ చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామశాఖల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 17, (సింగిడి): దసరా పండుగను పురస్కరించుకుని తొగుట మండలం వెంకట్రావుపేటలో గ్రామపంచాయతీ కార్మికులకు సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ కొత్త బట్టలు, శానిటరీ కిట్లు పంపిణీ చేశారు. గ్రామ పారిశుద్ధ్యం, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కార్మికుల సేవలు అమూల్యమని కవిత కొనియాడారు. వారి సేవలను గుర్తిస్తూ పండుగ కానుకలు అందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, ఉపసర్పంచ్ లచ్చోళ్ల లింగం, కార్యదర్శి రవీందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, వార్డు సభ్యులు పిట్ట వెంకటేష్, జహంగీర్, కత్తుల వాణి, రమేష్, నాయకులు పెంటోజి, పీట్ల వెంకటయ్య, ఈదుగళ్ల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు...

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 17, (సింగిడి): దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు ఆడపడుచులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు... ఈ సందర్భంగా మాట్లాడుతూ...పెత్తర అమావాస్యరోజున ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై, తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ, ఆడబిడ్డల ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమని...ప్రకృతితో మమేకమై, పూలనే దేవతగా కొలుస్తూ, గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించే ఈ బతుకమ్మ పండుగ దుబ్బాక మహిళల ఐక్యతకు, అనుబంధాలకు, ఆత్మీయతకు అద్దం పడుతుందని అన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, ఆడబిడ్డలందరూ ఒకచోట చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతుందని, బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు. మన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీక అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి, మన సంస్కృతికి మరింత ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు. ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో జరుపుకునే బతుకమ్మ పండుగ నేడు దేశ విదేశాల్లో ఘనంగా జరుపుకునే స్థాయికి చేరుకుందని తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని, దుబ్బాక ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షిస్తున్నారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరైన కల్వకుంట్ల వంశీధర్ రావు



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 17, (సింగిడి): సిద్దిపేట పట్టణంలో మార్కండేయ స్వామి ఆలయం సమీపంలో బురుజు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులతో సిద్దిపేట ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితం ఆనందోత్సవాల నడుమ ఉండాలని, అభివృద్ధి, శాంతి, సంతోషాలు నిండాలని ఆకాంక్షిస్తున్నాను. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరి గౌడ్, సత్యం గౌడ్, రాజు, బురుజు ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు రవితేజ, శ్రీహరి, మహేష్, అజ్జు సుమన్, సూరం ప్రసాద్, పెద్ది అశోక్, మల్లేశం, బాలకిషన్, మల్లికార్జున్, బేతి శ్రీనివాస్, బైరి ప్రకాష్, బల్లా కాలిదాస్, శ్రీనివాస్, కాల్వ ప్రవీణ్, బింగి సాయికుమార్, రాపర్తి రాజు, భాను చందర్, వెల్ది శ్రీనివాస్, కొండ నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు హరీష్‌రావు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 17, (సింగిడి): సిద్దిపేట జిల్లా ప్రజలకు ఆడపడుచులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతు...పెత్తర అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై, తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ, ఆడబిడ్డల ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రకృతితో మమేకమై, పూలనే దేవతగా కొలుస్తూ, గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించే ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఐక్యతకు, అనుబంధాలకు, ఆత్మీయతకు అద్దం పడుతుందని చెప్పారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆడబిడ్డలందరూ ఒకచోట చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన తెలంగాణ ప్రత్యేక



సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతుందని....బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. మన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీక అని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి, మన సంస్కృతికి మరింత ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు. ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో జరుపుకునే బతుకమ్మ పండుగ నేడు దేశ విదేశాల్లో ఘనంగా జరుపుకునే స్థాయికి చేరుకుందని తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని, తెలంగాణ ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

షోయబ్ ఉల్లా ఖాన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముజీబ్ డిమాండ్

కరీంనగర్,అక్టోబర్17(సింగిడి): ప్రముఖ పాత్రికేయుడు, అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముజీబ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో ముజీబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో షోయబ్



ఉల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలాన్నే ఆయుధంగా చేసుకుని పోరాడిన ధైర్యశాలి షోయబ్ ఉల్లా ఖాన్ అని కొనియాడారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమీయుల్లా అహ్మద్, మహమ్మద్ సైద్, అబూబకర్, ఫయాజ్ చిస్తీ, సర్దార్, మహమ్మద్ ఆతీఫ్, అమీర్, రౌఫ్‌తో పాటు బీజేపీ నాయకులు, మైనారిటీ మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులకు ఘన సన్మానం

కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్

జమ్మికుంట, అక్టోబర్ 17 (సింగిడి): పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పైడిపల్లి చంద్రమోహన్, తిప్పారపు తుకారాం లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం నల్గొండలో



జరిగిన పి ఆర్ టి యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వీరిని శుక్రవారం వారి నివాసాల్లో కలిసి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పింగళి రమేష్ మాట్లాడుతూ.. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీర్చిదిద్దుతున్న చంద్రమోహన్, తుకారాం లు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ఉపాధ్యాయ రంగానికి సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం తో పాటు సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. తమను ప్రోత్సహిస్తూ అభిమానిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

హౌసింగ్ బోర్డ్ కాలనీలో వైభవంగా మహా చండీయాగం

- దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేకపూజలు
- దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

జమ్మికుంట, అక్టోబర్ 17 (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహా చండీయాగాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత పదేళ్లుగా కాలనీలో దుర్గామాత



నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ఏడాది దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు కిశోరాచార్యులు, హర్షాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ చండీ హోమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ , మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతాం

- ఈ నెల 23న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్, అక్టోబర్17(సింగిడి): భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు తిమ్మాపూర్ మండలంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉపమేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రైతుల రుణమాఫీతో పాటు రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని



ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఈ నెల 23న రైతుల సమస్యలపై కరీంనగర్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని 12 శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, కార్యకర్తలు రైతులను పెద్ద సంఖ్యలో సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19లోగా శక్తి కేంద్రాల వారీగా సమావేశాలు నిర్వహించి, 25న అల్పాహార సమావేశాల ద్వారా యువత, రైతులను సమాయత్తం చేయాలని సూచించారు. అలాగే, వచ్చే నెల 3న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మద్దతుగా భారీ యువజన ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా ఐక్యంగా కృషి చేయాలని కోరారు. మహాశక్తి ఆలయంలో యాదగిరి సునీల్‌రావు దంపతుల కుంకుమ పూజ,కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి కుంకుమ పూజలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పర్యవేక్షణలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్‌రావు, ఆయన సతీమణి అపర్ణ పాల్గొన్నారు. నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యులు కూడా ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న యాదగిరి సునీల్‌రావు

దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ



కరీంనగర్, అక్టోబర్17(సింగిడి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉప మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు నగరంలోని పలు అమ్మవారి మండపాలు, ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగత్‌నగర్‌లో పెద్దమ్మ యూత్ క్లబ్, గోదాంగడ్డ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను ఆయన దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. వావిలాలపల్లిలోని విజయలక్ష్మీ సమేత కనకదుర్గ ఆలయంలోనూ కార్పొరేటర్ బండారి వేణుతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దమ్మ యూత్ క్లబ్, గణేష్ యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ పేలుడు పదార్థాలు స్వాధీనం ఒకరి అరెస్టు

475 జిలెటిన్ కడ్డీలు, 3 వేల మీటర్ల పేలుడు తీగ, రెండు కంప్రెసర్ ట్రాక్టర్లు పట్టివేత



కరీంనగర్, అక్టోబర్17(సింగిడి): కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అక్రమంగా పేలుడు పదార్థాలు కలిగి ఉన్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో వ్యవసాయ బావి తవ్వుతున్న ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి, రామడుగు మండలం శ్రీరాములపల్లెకు చెందిన వేముల భూమయ్య (45)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 475 జిలెటిన్ కడ్డీలు, సుమారు 3 వేల మీటర్ల పేలుడు తీగ, రెండు కంప్రెసర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పేలుడు పదార్థాలు, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సైదాపూర్ పోలీసులకు అప్పగించారు.

ప్రజల దాహార్తి తీర్చిన బిఆర్ఎస్ పార్టీ

రాష్ట్ర నాయకులు వంశీధర్ రావు



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 17, (సింగిడి): సిద్దిపేట పట్టణంలో 37వ వార్డు అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వంశీధర్ రావు దృష్టికి తీసుక రావడంతో వెంటనే బోర్ వేల్ వాహనం తెప్పించి బోరు వేయించారు. బోరు ద్వారా నీరు రావడంతో కాలనీవాసుల నీటి కష్టాలు తగ్గించారని కాలనీవాసులు వంశీధర్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్క బాల్ నర్సయ్య, దువ్వల కొమురయ్య, సాకి మల్లేశం, కిట్టు, తోల్కుంటి వీరభద్రం, తాండ భూమయ్య, నాగరాజు, రేణుక ,జ్యోతి ,చిరు, కాలనీవాసులు పాల్గొన్నారు

జనరల్ NEWS

సింగిడి

సుభాష్ యూత్ నిత్య అన్నదానానికి ఉదార చేయూత



- రూ.51,116 విరాళం అందించిన యప్‌టీవీ, అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి

జమ్మికుంట, అక్టోబర్ 17 (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి వీధిలో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కమిటీ సభ్యులు చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమానికి యప్‌టీవీ, ట్యూరిటో సంస్థల వ్యవస్థాపకుడు, సీఈఓ పాడి ఉదయ్ నందన్ రెడ్డి రూ. 51,116 విరాళాన్ని అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించాలన్న సుభాష్ యూత్ కమిటీ సంకల్పానికి ఆయన వెంటనే స్పందించి, తన బృందం ద్వారా విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, సుభాష్ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ ఏడాది ఉత్సవాలను గతంలో కంటే వైభవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన పాడి ఉదయ్ నందన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు ఆయన కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ యూత్ అధ్యక్షుడు ముత్యాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి చుక్కారపు అఖిలేష్, ఉపాధ్యక్షులు చుంచు శివ, చుంచు వీరేశం, ఎల్ల గణేష్, సీహెచ్ మనోజ్ కుమార్, జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శరత్ కుమార్, కమిటీ సభ్యులతో పాటు పాడి ఉదయ్ నందన్ రెడ్డి బృంద సభ్యులు అంజి గౌడ్, రాయిశెట్టి కుమారస్వామి, మంతెన శ్రీధర్, తాళ్లపెల్లి కుమారస్వామి, సిరిగిరి రాజశేఖర్, తొట్ల రాకేష్, దాసారపు చందు, లోకేష్, అశోక్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ



కోదాడ, అక్టోబర్ 17(సింగిడి): అనంతగిరి తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధిగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో 11వ రోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 210 మంది అయ్యప్ప స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ రోజు అన్నప్రసాదానికి బుర్ర పుల్లారెడ్డి--సుధారాణి, పసుమర్తి హరిప్రకాష్--ప్రత్యూష దంపతులు దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, తిరుపతిరావు, పి. నరసింహారావు, సట్టు యాదగిరి, మాలధారణ స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఇండ్లు లేని పేదలు ఉండొద్దు

ఎమ్మెల్సీ శంకర్ నాయక్



మిర్యాలగూడ అక్టోబర్ 17 (సింగిడి) : తెలంగాణ రాష్ట్రంలో పేదలకు ఇండ్ల లేకుండా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని శాసన మండలి సభ్యులు,ఆదివాసి కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కేతవాత్ శంకర్ నాయక్ అన్నారు.శనివారం దామరచర్ల మండలం నూనావత్ తండాలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పేదలు లేని ఇల్లు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సహకారం చేసేందుకే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రతను ఆత్మగౌరవాన్ని ఇస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా నూతన గృహప్రవేశం చేసిన నూనావత్ రామచంద్రు శారదా దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదా నాయక్, వెంకన్న, బాలు, బాబు, రాము, బాలు ధర్మ, ఉపేందర్, మేఘ్యు, నరేష్ తదితరులు పాల్గొన్నారు

శ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గాభవాని దర్శనం



చింతపల్లి, అక్టోబర్ 17 (సింగిడి): మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో కొలువుదీరిన శ్రీ దుర్గాభవాని అమ్మవారు శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సోమరాజు సాయికుమార్ శ్రీదివ్య దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆదిత్యుని మహేంద్ర శర్మ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో గురుస్వామి చేనమోని రాములు, ఎల్లంకి రవి, సోమరాజు రాధా కిషన్, సోమరాజు ప్రదీప్ కుమార్, గోవిందు రవి, గోవిందు ప్రసాద్, యాచారం ఆంజనేయులు ,కుందేళ్ళ చెన్నయ్య పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ, అక్టోబర్ 17 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను జిల్లా లోని మహిళలందరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే ప్రకృతి ప్రసాదించిన పూలను పూజించి, ప్రేమించే గొప్ప పండుగ నీ పద్యంలో ఈ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలు, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

దీక్షలోని క్రమశిక్షణే జీవితానికి మార్గదర్శకం..!!

- గోదావరిఖని ఏసీపీ మడత రమేష్
- యువతలో మహిళల పట్ల గౌరవభావం పెంపొందాలి..
- నవరాత్రి వేడుకల్లో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్
- పెద్దంపేట దుర్గామాత మండపంలో పోలీసు అధికారుల ప్రత్యేకపూజలు



గోదావరిఖని అక్టోబర్ 17 (సింగిడి): ఆధ్యాత్మిక దీక్షల సమయంలో పాటించే నియమ నిష్ఠలు, క్రమశిక్షణను కేవలం పండుగలకే పరిమితం చేయకుండా జీవితాంతం ఆచరణలో పెట్టాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పిలుపునిచ్చారు. యువతలో నైతిక విలువలు పెంపొందించుకోవడంతో పాటు మహిళలను గౌరవించేసంస్కారాన్నిప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో శ్రీ దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, డీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ ఆహ్వానం మేరకు దుర్గామాత మండపాన్ని ఏసీపీ మడత రమేష్ సందర్శించారు. రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎస్సైలు హరిశేఖర్, టి. ఉదయ్ కిరణ్‌లతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళల పట్ల గౌరవమే నిజమైన సంస్కారం

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, దీక్ష సమయంలో పాటించే క్రమశిక్షణ, నియమ నిష్ఠలు మనిషి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు మంచి నడవడిక, బాధ్యతాయుతమైన ప్రవర్తనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి మహిళలో అమ్మవారి రూపాన్ని, ఆడబిడ్డను చూసే గౌరవప్రదమైన ఆలోచనా విధానం సమాజంలో పెంపొందాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ, పోలీసు శాఖ తరఫున ప్రాంత ప్రజలకు బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలీసు అధికారులకు ఘన సన్మానం

అనంతరం శ్రీ దుర్గాభవాని యూత్ కమిటీ సభ్యులు ఏసీపీ మడత రమేష్, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎస్సై హరిశేఖర్, అంతర్గాం ఎస్సై టి. ఉదయ్ కిరణ్, డీసీసీ అధికార ప్రతినిధి పెండ్యాల మహేష్‌లను శాలువాలతో సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని యూత్ సభ్యులు పైడిపల్లి విజయ్, బీరెల్లి శరణ్, మారుతి అజయ్, కోల ఉదయ్, కోలా మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల శ్రీనివాస్, మేరుగు కుమార్ గౌడ్, పల్లె రవీందర్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పైడిపల్లి ప్రసాద్, వేల్పుల కుమార్ యాదవ్‌తో పాటు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో ప్రజలకు అండగా నిలిచిన సేవలకు సెల్యూట్..!

108 ఉద్యోగికి ఘనమైన వీడ్కోలు.. ఆత్మీయత, అనుబంధాల మధ్య అభినందనల వెల్లువ

ఉద్యోగి సేవలను కొనియాడిన పెద్దపల్లి జిల్లా 108 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



పెద్దపల్లి, అక్టోబర్ 17 (సింగిడి): ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సకాలంలో వైద్య సహాయం అందిస్తూ, అత్యవసర వేళల్లో ప్రజలకు అండగా నిలుస్తున్న 108 సేవల్లో ఉద్యోగుల అంకితభావం వెలకట్టలేనిదని పెద్దపల్లి జిల్లా 108 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన ఉద్యోగికి సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సహచర ఉద్యోగుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం అభిమానం, అనుబంధం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.

విధి నిర్వహణలో అంకితభావం అభినందనీయం!

అత్యవసర పరిస్థితుల్లో క్షణం ఆలస్యం కూడా ప్రాణాలపై ప్రభావం చూపే సందర్భాల్లో 108 సిబ్బంది అందించే సేవలు ఎంతో కీలకమని సంఘం ప్రతినిధులు తెలిపారు. ప్రజలకు వైద్య సహాయం అందించడంలో సమయస్ఫూర్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి సవాళ్ల మధ్య విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఉద్యోగి సేవలను సహచరులు ప్రత్యేకంగా గుర్తుచేసుకుని అభినందించారు. కలిసి పనిచేసిన రోజులు, విధి నిర్వహణలో ఎదురైన అనుభవాలు, పరస్పరం అందించుకున్న సహకారం ఉద్యోగుల మధ్య బలమైన అనుబంధాలను ఏర్పరుస్తాయని పలువురు పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతల్లో మార్పులు వచ్చినా సహచరులతో ఏర్పడిన ఆత్మీయత ఎప్పటికీ చెరిగిపోదని భావోద్వేగంగా తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లి జిల్లా 108 ఉద్యోగుల సంఘం నిరంతరం కృషి చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తూ, పరస్పర సహకారంతో ముందుకు సాగడమే సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో దాసరపు సంపత్, తిరుమల సురేష్, పడిందా కుమార్, స్వామి, అనిల్, రవి వర్మ, కిషన్, రాజ్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. వీడ్కోలు పొందిన ఉద్యోగికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

భూపాలపల్లి అభివృద్ధికి రోడ్ల విస్తరణే కీలకం

- రూ. 70 కోట్లతో రోడ్ల విస్తరణ..
- అమృత్ పథకం కింద రూ. 23 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- పనుల్లో జాప్యం వద్దు ప్రతివారం సమీక్షిస్తాం..
- అధికారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశం





భూపాలపల్లి, అక్టోబర్ 17 (సింగిడి): భూపాలపల్లి పట్టణంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యంగా అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలతో నిర్దీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ కూడలి అభివృద్ధి నమూనాను పరిశీలించిన ఎమ్మెల్యే.. పలు ప్రాంతాల్లో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

రూ. 70 కోట్లతో రోడ్ల విస్తరణ

భూపాలపల్లి పట్టణంలో రోడ్ల విస్తరణకు రూ. 70 కోట్లు, మౌలిక వసతుల అభివృద్ధికి అమృత్ పథకం కింద రూ. 23 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకు, అంబేద్కర్ జంక్షన్ నుంచి సింగరేణి గ్రౌండ్ మీదుగా కృష్ణా కాలనీ వరకు, ఓసి-2 మార్గంలో రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బొగ్గు,బూడిద, ఇసుక లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలు పెరుగుతున్ననేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలను నివారించేందుకు రహదారుల విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు.

.భూ సేకరణ సమస్యలకు పరిష్కారం..

సింగరేణి ప్రాంతంలో 1988లోనే 200 అడుగుల రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఎమ్మెల్యే వివరించారు. ఓసి -1, 5 ఇంక్లైన్ ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ చేపట్టాలని ఆదేశించారు. కన్నం రాజయ్య ఇంటికి సంబంధించిన భూసేకరణ అంశం మినహా మిగతా ప్రాంతాల్లో ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు అవసరమైన మొత్తాన్ని డిపాజిట్ చేసి, పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకర్షణీయంగా జంక్షన్ల అభివృద్ధి పట్టణ సుందరీకరణలో భాగంగా అంబేద్కర్ కూడా లేని ఫౌంటెన్, ఆధునిక ఆర్కిటెక్చర్ తో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆర్జీసీ సమీపంలోని జంక్షన్ లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసి, ఆ ప్రాంతానికి గద్దర్ జంక్షన్ గా నామకరణం చేసే ప్రతిపాదనలను పరిశీలించారు. హనుమాన్ జంక్షన్, రాజీవ్ జంక్షన్, మంజూరు నగర్ ప్రాంతాల్లో నూ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

.చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు..

రోడ్ల విస్తరణతో ఇబ్బందులు ఎదుర్కొనే చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా రోడ్డు సరిహద్దుల్లో తగిన స్థలం, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు అవసరమైన నిర్మాణ పనులను 10 రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్, తాగునీటి పైపులైన్ల మార్పునకు సమన్వయం

రోడ్ల విస్తరణకు అడ్డంకిగా ఉన్న సింగరేణి, విద్యుత్ శాఖ, జెన్కో విద్యుత్ లైన్లు, ఆర్ డబ్ల్యూ ఎస్, మిషన్ భగీరథ, సింగరేణి పైపులైన్లను మార్చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. తక్షణమే అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, సైడ్ డ్రాయిన్ నిర్మాణానికి మున్సిపల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి షార్ట్ టెండర్ల ద్వారా పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, సింగరేణి, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

జలసిరి పనులపై రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ సంతృప్తి

- శారాజీపేటలో ఫామ్ పాండ్ నిర్మాణ పనుల పరిశీలన



ఆలేరు అక్టోబర్ 17(సింగిడి): మండల పరిధిలోని శారాజీపేట గ్రామ పంచాయతీలో వివిజి రామ్ జీ పథకంలో భాగంగా చేపట్టిన జలసిరి పనులను రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ (పిఆర్ అండ్ ఆర్బి) సరిత పరిశీలించారు. శనివారం ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి పి పి)లో గుర్తించిన పనులు, వ్యక్తిగత లబ్ధిదారులకు సంబంధించిన పనులు, సామూహిక ప్రయోజనం చేకూర్చే కమ్యూనిటీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను సమీక్షించారు.

జలసిరి పనుల పురోగతిపై సమీక్ష

జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న మ్యాజిక్ సోక్ పిట్‌లు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులు, ఫామ్ పాండ్ నిర్మాణాల పురోగతిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వర్షపు నీటిని సమర్థంగా వినియోగించుకోవడం, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి, సిబ్బందిని పనుల ప్రస్తుత స్థితిగతులు, గ్రామ పంచాయతీ ప్రణాళికలో గుర్తించిన పనుల అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ సత్యాంజనేయ ప్రసాద్, ఏపీడీ (డి ఆర్ డీ ఎ) నవీన్, ఎంపీవో అనురాధ దేవి, ఏపీవో అరుణకుమారి, ఈసీ వై. ఆర్. చారి, టీఏ మానస, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీక

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



మల్కాజిగిరి, అక్టోబర్ 17(సింగిడి): మల్కాజిగిరి సర్కిల్ మల్కాజిగిరి దిల్దర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రులు సందర్భంగా శనివారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రులు భక్తి తోపాటు ఆధ్యాత్మికత, ఐక్యత కు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బూంపల్లి సాయి తేజా, కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పి వి సత్యనారాయణ, జీడి సంపత్ గౌడ్, కపిలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు





హన్మకొండ, అక్టోబర్ 17, (సింగిడి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో 'ట్రై శనివారం నిర్వహించిన సిటీస్ హాఫ్ మారథాన్ -- 2026, ఎడిషన్ 02' కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజులు కలిసి శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 17 (సింగిడి): కాంట్రాక్ట్ ఎన్హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట.. గత ఐదు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు శనివారం మద్దతుగా నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి సమ్మెలో పాల్గొని ప్రసంగించారు.ఎన్ హెచ్ ఎం న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని... గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న వీరికి.. పని భారం కొంతంత వచ్చేది మాత్రం గోరంత అని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రభుత్వం అంగన్వాడి ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి వారి జీవితాలు నిలబెట్టిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలైనా ఇచ్చిన హామీ నిలబెట్టుకోకుండా.. తాత్సర్యం చేస్తుందని వారందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన అన్నారు. లేనియెడల బి ఆర్ ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లిఖార్జున రెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు లొడంగి గోవర్ధన్ మాజీ సర్పంచ్ కోట్ల జయపాల్ రెడ్డి కోట్ల అశోక్ రెడ్డి తోపాటు ఎన్ హెచ్ ఎం సంఘ నాయకులు పాల్గొన్నారు.



యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరిగితే .!

సమస్య పెరగకుండా ఏం చేయాలంటే!

గౌట్ అనేది కాలి బొటనవేలులో వచ్చే సమస్య. ఎప్పుడైతే మన రక్తంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ ఎక్కువగా పెరుగుతాయో కీళ్లలో స్ఫటికాలు ఏర్పడతాయి. దీంతో విపరీతంగా నొప్పి, వాపు ఉంటుంది. ఈ ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్ సమస్యనే గౌట్ అంటారు. ఈ సమస్యతో చాలా మంది బాధపడుతుంటారు. అయితే, తాజాగా ఈ సమస్య గురించి కొన్ని ముఖ్య వార్తలొస్తున్నాయి. సమస్య వస్తే కీళ్లకే పరిమితం కాకుండా గుండె సమస్యలు, గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలకి కూడా కారణమవుతుందట.కీళ్లకి వచ్చే గౌట్ సమస్యతో చాలా మంది బాధపడుతుంటారు. రక్తంలో పెరిగిన యూరిక్ యాసిడ్ కారణంగా సమస్య వస్తుంది. దీంతో దానిని తగ్గించుకునేందుకు రకరకాల చిట్కాలు, ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. ఎందుకంటే వ్యాధి తీవ్రత అంత దారుణంగా ఉంటుంది.

ఇది ముఖ్యంగా కాలి బొటనవేలులో వచ్చి ఎర్రగా మారి నొప్పి వాపుని కలిగిస్తుంది. దీంతో విలవిల్లాడిపోతారు. ఇక చల్లని వాతావరణంలో సమస్య పెరుగుతుంది. వర్షాకాలం ముఖ్యంగా చలికాలంలో అయితే యూరిక్ యాసిడ్, గౌట్, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడే వారు నొప్పులతో విలవిల్లాడిపోతారు. అయితే, ఇది ఆ కీళ్ళవాతంతోనే ఆగిపోదు. గౌట్ సమస్యలు ఉన్నవారికి గుండెపోటు, పక్షవాతంతో సహా గుండె సంబంధ సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు డాక్టర్ యతీష్ జి.సి. (లీడ్ కన్సల్టెంట్ రుమటాలజి, ఆస్టర్ వైట్‌ఫీల్డ్ హాస్పిటల్). మరి సమస్య పెరిగి ప్రమాదంగా మారకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి.

గౌట్ కారణంగా గుండెసమస్యలు

రక్తంలో యూరిక్ యాసిడ్ పెరిగి కీళ్లలో సూది ఆకారంలో స్ఫటికాలుగా ఏర్పడి గౌట్ వస్తుంది. యూరిక్ యాసిడ్ పెరగడం, గౌట్‌తో సంబంధం ఉన్నవాపు అనేవి రక్తనాళాల పనితీరులో లోపం, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదంతో కూడా ముడిపడి ఉండొచ్చని చెబుతున్నారు డాక్టర్. అయితే, ఈ సంబంధం గురించి అన్ని విధాలుగా ఆలోచించాలి. కేవలం యూరిక్ యాసిడ్ పెరిగినంత మాత్రాన ఓ వ్యక్తికి గుండె సమస్యలొస్తాయని చెప్పలేమని కూడా డాక్టర్ చెబుతున్నారు.

అసలు గౌట్‌కి గుండె సమస్యల మధ్య సంబంధం

గౌట్, గుండె సంబంధ సమస్యల మధ్య సంబంధానికి ముఖ్య కారణం గౌట్ అనేది హైబీపి, ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి, అసాధారణ కొలెస్ట్రాల్ స్థాయిలతో సహా హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచే పరిస్థితులకి కారణమవుతుంది. ఇవి యూరిక్ యాసిడ్ లెవల్స్‌ని ఎఫెక్ట్ చేసి గుండె, రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయి.

గౌట్ తగ్గేందుకు

గౌట్ సమస్య తగ్గించుకునేందుకుయూరిక్ యాసిడ్ లెవల్స్, కిడ్నీల పనితీరు, రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్‌ల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. అవసరమైతే మెడిసిన్ తీసుకోవడం వల్ల సమస్య తగ్గడంలో హెల్ప్ అవుతుంది. అయితే, ఇది డాక్టర్ సలహాతోనే తీసుకోవాలి. కీళ్లలో నొప్పి లేదని ఎట్టిపరిస్థితుల్లోనూ మెడిసిన్ ఆపొద్దు. ట్రీట్‌మెంట్‌తో గుండె సమస్యని తగ్గించలేం ఇక్కడ యూరిక్ యాసిడ్‌ని కంట్రోల్ చేయడానికి తీసుకునే ట్రీట్‌మెంట్‌తో గుండెపోటుని కంట్రోల్ చేయొచ్చని అనుకోవద్దు. ఎందుకంటే యూరిక్ యాసిడ్, గుండె సమస్యల మధ్య సంబంధం గురించి పరిశోధనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాబట్టి, ఎప్పుడు కూడా ఏదైనా సమస్య ఉంటే ముందుగా డాక్టర్‌ని కలిసి సరైన నివారణ చర్యలు



తీసుకోవాలి.

మంచి లైఫ్‌స్టైల్ కూడా ముఖ్యమే

యూరిక్ యాసిడ్, గౌట్ వీటి కారణంగా వచ్చే సమస్యల్ని తగ్గించుకునేందుకు సరైన లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం కూడా ముఖ్యమే. హెల్దీ వెయిట్ మెంటెయిన్ చేయాలి. రెగ్యులర్ వర్కౌట్, ఆల్కహాల్‌ని తగ్గించడం, షుగర్ డ్రింక్స్ తగ్గించడం, బ్యాలెన్స్‌డ్ డైట్ వంటివి జీవక్రియని పెంచి గుండె సంబంధ సమస్యలు రాకుండా చేస్తాయి. గౌట్ సమస్యతో బాధపడేవారు కేవలం నొప్పికి ట్రీట్‌మెంట్ తీసుకుంటే బాడీలోపల వచ్చే ప్రమాదకర సమస్యలు కూడా తగ్గుతాయనుకో వద్దు. గౌట్ సమస్యని గుండె సంబంధ, జీవక్రియ సమస్యలు రావడానికి ఓ కారణంగా గుర్తించి సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.



2.5 లక్షల కోట్ల ఆఫర్లు..

మార్కెట్‌ను షేక్ చేస్తున్న జియో ఐపీఓ క్రేజ్..



దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా నిలవనున్న రిలయన్స్ జియో ఐపీఓ కోసం ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఎగబడుతున్నారు. ఇష్యూ ఇంకా మార్కెట్‌లోకి రాకముందే గ్లోబల్, డొమెస్టిక్ దిగ్గజ సంస్థల నుంచి కనీవినీ ఎరుగని స్పందన లభిస్తోంది.

బిగ్ ఇన్వెస్టర్లు ఇప్పటికే ఏకంగా రూ. 2.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించినట్లు మార్కెట్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. జియో ఐపీఓలో భారీ ఎత్తున వాటాలు దక్కించుకునేందుకు ప్రపంచంలోని అత్యంత సంపన్న ప్రభుత్వ సంపద నిధులు క్యూ కట్టాయి. సింగపూర్, నార్వే, అబుదాబి, ఖతార్‌లకు చెందిన ప్రభుత్వ ఫండ్‌లు ఇందులో పెట్టుబడులకు సిద్ధమైనట్లు సమాచారం. వీటితో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో వేల కోట్ల డాలర్లను శాసించే బ్లాక్‌రాక్, ఫిడిలిటీ, క్యాపిటల్ గ్రూప్ వంటి ప్రముఖ గ్లోబల్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు కూడా జియోలో ఇన్వెస్ట్ చేసేందుకు తీవ్ర ఆసక్తి కనబరుస్తున్నాయి.

దేశీయ దిగ్గజాలూ సై.. రంగంలోకి ఎల్ఐసీ, ఎస్‌బీఐ..
భారత మార్కెట్ దిగ్గజాలు కూడా ఈ ఐపీఓ రేసులో ఏమాత్రం తగ్గడం లేదు. దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ అయిన ఎల్ఐసీతో పాటు, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ వంటి అగ్రశ్రేణి సంస్థలు జియో షేర్ల కోసం పోటీ పడుతున్నాయి. దేశంలోని టాప్ 10 మ్యూచువల్ ఫండ్‌లు, టాప్-5 ఇన్సూరెన్స్ కంపెనీలు సైతం ఇందులో పాల్గొనేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. భారీ సంస్థాగత ఇన్వెస్టర్ల ఎంట్రీ ఈ ఐపీఓ విజయానికి అత్యంత కీలకం కానుంది.

కేవలం టెలికాం మాత్రమే కాదు.. డిజిటల్ సామ్రాజ్యంపై గురి
జియో వ్యాపారం కేవలం 4+, 5+ మొబైల్ సేవలకే పరిమితం కాలేదు. హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్, క్లౌడ్ సర్వీసెస్, ఓటీటీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ సొల్యూషన్స్ వంటి విస్తారమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను జియో నిర్మించింది. అందుకే ఇన్వెస్టర్లు దీన్ని కేవలం ఒక టెలికాం కంపెనీగా చూడటం లేదు. జియో ఐపీఓలో షేర్లు కొనుగోలు చేయడాన్ని దేశ డిజిటల్ విప్లవంలో ప్రత్యక్ష భాగస్వామ్యం దక్కించుకునే అరుదైన అవకాశంగా భావిస్తున్నారు.

ధరల శ్రేణి ఎంతంటే?
జియో ఐపీఓ కోసం ఒక్కో షేరు ప్రైస్ బ్యాండ్‌ను రూ. 1,065 నుంచి రూ. 1,119గా నిర్ణయించారు. రిటైల్ చిన్న ఇన్వెస్టర్లతో పాటు బడా సంస్థాగత ఇన్వెస్టర్లకు కూడా ఇదే ధర వర్తిస్తుంది. అంటే మార్కెట్‌లోని అందరు మదుపరులకు సమానమైన ఇష్యూ ధరే అందుబాటులో ఉండనుంది.

బిడ్డింగ్ ఎప్పటి నుంచి?
ఈ క్రేజీ ఐపీఓ అక్టోబర్ 21న సబ్‌స్క్రిప్షన్ కోసం మార్కెట్‌లో ప్రారంభమై, అక్టోబర్ 23తో ముగియనుంది. పెట్టుబడిదారులు షేర్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఉంటుంది.

టన్నులు టన్నులుగా
బంగారాన్ని కొనేస్తున్న చైనా..
వామ్మో పెద్ద ప్లానింగే..!

స్టాక్ మార్కెట్ Stock Market

చైనా కేంద్ర బ్యాంకు అయిన పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా సెప్టెంబర్‌లో 23 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అక్టోబర్ 2023 తర్వాత ఒకే నెలలో జరిగిన అతిపెద్ద కొనుగోలు ఇదే. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం, చైనా వరుసగా 23 నెలలుగా తన బంగారు నిల్వలను పెంచుకుంటూ వస్తోంది. ఈ ఏడాది జనవరి నుండి సెప్టెంబర్ వరకు, ఆ దేశం మొత్తం 103 టన్నుల బంగారాన్ని తన నిల్వలకు చేర్చింది. ఒక ప్రశ్న తలెత్తుతోంది.. చైనా ఇంత బంగారాన్ని ఎందుకు కొనుగోలు చేస్తోంది?

WGC డేటా ప్రకారం. ూర్వదీశీజ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం 63 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. 2023 మూడవ త్రైమాసికం తర్వాత ఇదే అతిపెద్ద త్రైమాసిక కొనుగోలు. చైనా మొత్తం విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటా 8.5 శాతం. ముఖ్యంగా, విదేశీ కరెన్సీలో ఉన్న ఆస్తుల విలువ తగ్గడం వల్ల, సెప్టెంబర్‌లో చైనా మొత్తం విదేశీ మారక నిల్వలు 2 శాతం తగ్గి సుమారు వి3.8 ట్రిలియన్లకు పడిపోయాయి.

చైనా దగ్గర ఎంత బంగారం ఉంది?
సెప్టెంబర్‌లో బంగారం ధరలు తగ్గిన సమయంలో చైనా కొనుగోళ్లు జరిగాయి. డాలర్లలోూదీపీూ బంగారం ధర 8.5 శాతం, యువాన్లలో షాంఘై బెంచ్‌మార్క్ ధర 5.5 శాతం తగ్గాయి. ఔ+జ విశ్లేషణ



ప్రకారం, యూఎస్ ట్రెజరీ బాండ్లపై పెరుగుతున్న రాబడులు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కఠినతరం అవుతున్న విధానం, బలపడుతున్న డాలర్ కారణంగా ఇది జరిగింది. అయినప్పటికీ, త్రైమాసికం అంతటా బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. అక్టోబర్ ప్రారంభంలో ధరలు స్థిరంగా ఉన్నాయి. తర్వాతీయంగా బంగారం ధర ఔన్సుకు వి4,100 కంటే ఎక్కువగా ఉంది.

డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నం:
విశ్లేషకుల ప్రకారం.. అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకుని, తన విదేశీ మారక నిల్వలను మరింత సురక్షితం చేసుకోవడమే చైనా లక్ష్యం. మనీ మెటల్స్ ఎక్స్ఛేంజ్ విశ్లేషకుడైన మైక్ మహ్రే, బంగారం అనేది మరో దేశ ప్రభుత్వానికి భారంగా మారని ఒక ఆస్తి అని అంటారు. డాలర్లలో విలువ కట్టే ఆస్తుల విలువ ఆ దేశ పనితీరు, దాని ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. కానీ బంగారానికి అలాంటి నష్టభయాలు ఉండవు.
ఈ వ్యూహం వెనుక రెండు ప్రధాన ఆందోళనలు కారణంగా పేర్కొంటున్నారు. మొదటిది అమెరికా నిరంతరం పెరుగుతున్న అప్పు. అమెరికా తన ఖర్చులో గణనీయమైన భాగాన్ని అప్పుల ద్వారా సమకూరుస్తుంది. అలాగే ప్రపంచ కరెన్సీగా డాలర్ పోషిస్తున్న పాత్ర దాని బడ్జెట్ లోటును పూడ్చడానికి సహాయపడుతుంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు డాలర్లు, అమెరికా బాండ్లను కలిగి ఉండటంపై ఆసక్తి కోల్పోతే, అమెరికాకు అప్పులు చేయడం మరింత ఖరీదైనదిగా మారవచ్చు. ఇది డాలర్‌పై ఒత్తిడిని పెంచుతుంది.

దేశీయ మార్కెట్‌లో కూడా డిమాండ్ పెరిగింది
చైనాలో బంగారం డిమాండ్ కేవలం ప్రభుత్వ స్థాయిలో మాత్రమే లేదు. ఔ+జ ప్రకారం, చైనీస్ గోల్డ్ జువెలరీ సెప్టెంబర్‌లో 11 టన్నుల బంగారాన్ని చేర్చుకున్నాయి. ఇది వరుసగా మూడవ నెల నిల్వల పెరుగుదలను సూచిస్తుంది. మొత్తం గోల్డ్ జువెలరీ నిల్వలు 304 టన్నుల రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మూడవ త్రైమాసికంలో ఈ జువెలరీలో పెట్టుబడుల మొత్తం సుమారుగా వి3.9 బిలియన్లు. స్థానిక స్టాక్ మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత, ప్రభుత్వ బాండ్లపై రాబడులు తగ్గడం వంటి కారణాల నేపథ్యంలో పెట్టుబడులను విస్తరించాల్సిన అవసరం ఏర్పడటమే దీనికి కారణమని చెబుతున్నారు.

డాలర్ ఆధిపత్యం తక్షణమే అంతం కాదు:
ఇవన్నీ ఉన్నప్పటికీ, డాలర్ ఆధిపత్యం తక్షణమే ముగిసే అవకాశం లేదని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలో డాలర్ ఒక కీలకమైన అంశంగా కొనసాగుతోంది. అయితే, విదేశీ మారక నిల్వలను వైవిధ్యపరిచే ఈ ధోరణి కొనసాగితే, దీర్ఘకాలంలో డాలర్ ఆధారిత ఆస్తులకు విదేశీ డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం, చైనా నిరంతరం బంగారం కొనుగోలు చేసే వ్యూహం, భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంటుందనే దానిపైనా, డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంలో బంగారం పెద్ద పాత్ర పోషించగలదా అనే దానిపైనా చర్చను మరింత తీవ్రతరం చేసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కైజాద్ భరూచా రాజీనామా

దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (డిప్యూటీ ఎండీ) కైజాద్ భరూచా తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామా వివరాలను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యం అధికారికంగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. దశాబ్దాలుగా బ్యాంక్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన ఆయన ఆకస్మిక రాజీనామా నిర్ణయం బ్యాంకింగ్, మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రారంభ దశ నుంచే విశేష సేవలందించిన కైజాద్ భరూచా, రిస్క్ మేనేజ్‌మెంట్, క్రెడిట్ పాలసీలు, కార్పొరేట్ బ్యాంకింగ్ విభాగాలను పటిష్టం చేయడంలో అత్యంత కీలకంగా వ్యవహరించారు. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌తో బ్యాంక్ చారిత్రక విలీనం తర్వాతి పరిణామాల్లోనూ ఆయన నాయకత్వం కీలకంగా నిలిచింది. ఆయన రాజీనామా కు గల ఖచ్చితమైన వ్యక్తిగత కారణాలు, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన అంశాలు త్వరలోనే వెల్లడికానున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో బ్యాంక్ నూతన నాయకత్వ



బాధ్యతల నియామకంపై మార్కెట్ దృష్టి సారించింది.

రూ.9.68కోట్ల ధాన్యం మాయం!

రైస్ మిల్లులో విజిలెన్స్, సివిల్ సప్లైస్ అధికారుల ఆకస్మిక తనిఖీలు.

మిల్లు యజమాని సహా 12 మందిపై కేసులు నమోదు



నాగర్ కర్నూల్ (సింగిడి): నాగర్ కర్నూల్ జిల్లా ముంతటి చౌరస్తా సమీపంలో ఉన్న మహాలక్ష్మి పారా బైల్డ్ రైస్ మిల్లులో సివిల్ సప్లైస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డులు భౌతిక నిల్వలను పరిశీలించి పంచనామా నిర్వహించిన అధికారులు 37.7604 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు. కొరతగా గుర్తించిన ధాన్యం విలువ సుమారు రూ. 9.68.64014 కోట్లుగా అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. ఖమీ 2022-23 2024-25 2025- 26 సీజన్లకు సంబం ధించిన ధాన్యంలో కొరతతోమిల్లు యజమాని సహా 12 మందిపై కేసులు ధాన్యం కొరతకు సంబంధించి జిల్లా మేనేజర్ దండు రాజేందర్ ఫిర్యాదు మేరకు మిల్లు యజమాని ఆకుతోట సాయిబాబా సుదర్శన్‌లతో పాటు మరో 11 మందిపై సంబంధిత చట్టాలు సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు నాగర్ కర్నూల్ ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

తనిఖీల సమయంలో యజమానులు ఎక్కడ?

రూ. 9. 68 కోట్ల విలువైన ధాన్యం కొరత వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు తనిఖీలు నిర్వహించిన సమయంలో మిల్లు యజమానులు అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తనిఖీలకు ముందే యజమానులకు సమాచారం అందిందా? అందితే ఎవరు అందించారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం నిల్వలు, వాటి నిర్వహణపై పర్యవేక్షణ ఎలా జరిగింది? ఇంత భారీ మొత్తంలో ధాన్యం కొరత ఏర్పడటానికి కారణాలేమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, తనిఖీలకు ముందే సమాచారం లీకైందనే అంశంపై అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది.

హమాలీలు, స్వీపర్లకు యూనిఫాం దుస్తులు పంపిణీ

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల బ్యూరో (సింగిడి):దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు యూనిఫాం దుస్తులను అందజేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు రెండు జతల యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని పౌర సరఫరాల సంస్థ ప్రతి ఏటా ఏం.ఎల్.ఎస్. పాయింట్స్‌లో హమాలీలు, స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి బోనస్, దుస్తులు అందజేస్తున్నదని అన్నారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్, అయిజ,మనోపాడు ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న 34 మంది హమాలీలు,నలుగురు స్వీపర్లు కలిపి మొత్తం 38 మందికి ఈ ఏడాది దసరా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరికీ రెండు జతల యూనిఫాం దుస్తులను నేడు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా,ప్రతి హమాలీకి,స్వీపర్‌కు రూ. 8,500 ప్రోత్సాహక నగదు, స్వీట్ బాక్స్‌కు బదులుగా రూ. 1,000 నగదు ఇప్పటికే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. యూనిఫాం కుట్టు ఖర్చుల నిమిత్తం హమాలీలకు రూ. 1,800 చొప్పున, స్వీపర్లకు రెండు బ్లౌజుల కుట్టు ఖర్చుల కోసం రూ. 800 చొప్పున నగదును కూడా ముందుగానే జమ చేసినట్లు వివరిం చారు. హమాలీలు,స్వీపర్లు నిరంతరం కష్టపడి పని చేస్తూ తమ విధుల పట్ల అంకితభావంతో వ్యవహరిస్తు న్నారని కలెక్టర్ అభినందించారు.ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను ఆనందో త్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్,హమాలీలు, స్వీపర్లు, సంబంధిత శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత..

అమ్మవారికి పూజలు చేసిన గోలి శ్రీనివాసరెడ్డి, జూలూరి రమేష్ బాబు





కల్వకుర్తి (సింగిడి): కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసా గుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా ధనలక్ష్మి దేవి అలంకరణలో కొలువు దీరిన దుర్గామాతను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న గోలి శ్రీనివాసరెడ్డి,కి ఉత్సవ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వా హకులు వారికి తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు.ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ, దుర్గామాత ఆశీస్సులతో కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతో షాలతో, ఆయురారో గ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు

కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ అలంకరణల్లో దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు, కల్మిచర్ల గోపాల్, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ అమ్మవారికి మంత్రి వాకిటి శ్రీహరి పట్టువస్త్రాలు



గద్వాల ప్రతినిధి (సింగిడి): దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరపున పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు అలం పూర్ శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. ఏ. సంపత్ కుమార్, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి హాజర య్యారు.ఆలయానికి చేరుకున్న మంత్రి దంపతులకు ఆలయ కార్యనిర్వహణా ధికారి దీప్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామివారికి మంత్రి దంపతులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, స్వామివారి ఆశీర్వచనాలు అందుకున్నారు.తదుపరి జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ అమ్మవారి ఆశీర్వాదం పొందిన మంత్రి దంపతులు భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య పాల్గొన్నారు. అలాగే ఆలయ అధికారులు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.



నాణ్యత విషయంలో రాజీ పడేది లేదు

పలు డివిజన్లలో భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): నిజామాబాద్ నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో 23, 24, 6, 48 వ డివిజన్‌లలో రోడ్డు పనులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమా వేశంలో ప్రతి డివిజన్ కు రూ. 20 లక్షలు కేటాయించారన్నారు. ఈ నిధులతో ప్రతి డివిజన్ అభివృద్ధి పనులు కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడం తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే ఖిల్లా రామాలయం అభివృద్ధిలో భాగంగా రోప్ వే కు సంబంధించిన డిపిఆర్ కూడా సిద్ధమవుతుందని చెప్పారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిజా మాబాద్ నియోజకవర్గంలో నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని. గత మూడు సంవత్సరాలుగా సీడీపీ నిధుల కోసం అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. కార్యక్ర మం లో మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి, సుమిత్ర కిషోర్, విజయ మల్లేష్ యాదవ్, ప్రసన్న శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో ఘనంగా అన్నదానం

సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు
మహా చండీ హోమం నిర్వహణ



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): నగరంలోని గుమస్తా కాలనీలో గల శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 6వ రోజు మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయా నికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు ఆర్యన్ తివారి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభి షేకాలు నిర్వహించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వేద బ్రాహ్మణులు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో మహా చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ అధ్యక్షుడు ఆమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ దుర్గమ్మ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి తో 6రోజులు పూర్తి చేసుకున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో భవానీ స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. నగరం నడి బొడ్డున ఉన్న ఈ ఆలయం ప్రత్యేక గుర్తింపు పొందిందని, భవిష్యత్తులో మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బోడికే బాబురావు, కోశాధికారి ధాత్రిక వేణుగోపాల్, లవంగ సదశివ, మాడూరి కిషన్, గంగోనే సంతోష్, గంగోనే అనిల్, ఆమంద్ వెంకట్, ఆమంద్ రాజేష్, దానాజీ, శ్రీనివాస్, సంతోష్, రామకృష్ణ, గోపాల్, నవీన్, రాజేష్, హరీష్ తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల వంటా వార్పు



నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్. హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్. హెచ్.ఏం జేపిసిఆధ్వ ర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటితో నారాయణపేట జిల్లాలో నాల్గవ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వివేకా నంద పార్క్‌వద్ద ఎన్. హెచ్. ఏం ఉద్యోగులు వంటా వార్పు చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్. హెచ్. ఏం నిరసనలకు పలు సంఘాల మద్దతు... ఎన్. హెచ్.ఏం ఉద్యోగుల రిలే దీక్షలకు జిల్లా డిఎంఎచ్ఓ కార్యాలయ తరపున డాక్టర్ సాయిరాం, డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి ఉద్యోగసంఘం తరపున డాక్టర్ బాలాజీ, సత్యనారాయణ, పిఆర్టీయూ ఉపాధ్యా య సంఘం మండల అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, టిఎన్జీఓ చైర్మెన్ నర్సింహ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉదయ్ భాను, విజయ కుమార్, యూటీఎఫ్ అధ్యక్షులు బాలాజీ, భీమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవిందరా జులు, కార్యదర్శి బలరాంలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్. హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా ఎన్. హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోందన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాలను పోషించేందుకు అందుకు తగిన వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్. హెచ్.ఏం ఉద్యోగుల న్యాయ మైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, ఎన్. హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, శ్రీలత, వెంటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, విరోజ, చందన,శ్వేతశ్రీ, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డిఏఏం మమత తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ పాఠశాలలో ఘనంగా 'మన వెల్దండ-పాదపూజ'



కల్వకుర్తి (సింగిడి):వెల్దండ మండలం లోని కేజీబీవీ పాఠశాలలో "మన వెల్దండ - పాదపూజ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐక్యత ఫౌండే షన్ సౌజన్యంతో, వందేమాతరం ఫౌండేషన్, మై విలేజ్ మోడల్ విలేజ్, ప్రతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము పాల్గొన్నారు.విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, వివిధ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే సంస్కారం, క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతాభావం పెంపొం దించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

విద్యతోపాటు మంచి విలువలు అలవర్చుకోవాలి: పాపిశెట్టి రామన్న ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు జీవితానికి అవసరమైన మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడుతుంటారని, ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థుల అభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. అందువల్ల విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను ఎల్లప్పుడూ గౌరవిస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతోపాటు వారిలో నైతిక విలువలను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల క్రమశిక్షణతో చదువుకొని, మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.పలువురు ప్రముఖుల హాజరుఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్‌కు చెందిన మాధవరెడ్డి, నితిన్ గౌడ్, చిత్తరంజన్ దాస్‌తో పాటు వారి బృందం, రామన్న మిత్రమండలి సభ్యుడు శ్రీను నాయక్, విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పత్రికా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్ మెంట్ రాజలక్ష్మి



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దమైన బతుకమ్మ పండుగ వేడుకలను తెలంగాణ ప్రోహిబిషన్, ఎక్సైజ్ హెడ్ కాని స్టేబుల్స్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల ఎన్ ఫోర్స్ మెంట్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో ఎక్సైజ్ మహిళ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, మహిళలు, యువతులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ రాజ్యలక్ష్మిలు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ప్రతిభంభించేలా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ పాటలతో సందడి చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పటేలా ప్రతి ఏడాది ప్రోహిబిషన్ , ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ అసిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనందదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అరుణ్ కుమార్, డి పి ఓ నంద గోపాల్, తిరుపతి, శ్రీనివాస్ లు, జోన్ కమిటీ సభ్యులు కైలాస్ పవర్, లింబాద్రి, చల్ల బాబు, విజయ్ నంద్, సిడి టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ కంబ్లి, రవి, మహిళ కానిస్టేబుళ్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం ఎకరాకు 25 వేలు ఇవ్వాలి: బిఆర్ఎస్



నారాయణపేట ప్రతినిధి, (సింగిడి): రాష్ట్రవ్యా ప్తంగా కరెంటు కోతలతో, పంటలు వేసుకుని నష్టపోతున్న రైతులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఇది ఎల్నినో కాదని, ప్రకృతి వైపరీత్యం అంతకన్నా కాదని, ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని బిఆర్ఎస్ నాయకులు మండి పడ్డారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాల యంలో పట్టణ అధ్యక్షుడు విజయ సాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో పై విధంగా ఆరోపించారు. నారాయణపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదని, గత ప్రభుత్వ బిఆర్ఎస్ హయాంలోనే జరిగిన అభివృద్ధి పనులకు ప్రస్తుతము రిబ్బన్ కటింగ్లు, చేయడం తప్ప తట్టెడు మట్టి కూడా తీసి ఎరగని ఈ నాయకులా మాట్లాడుతున్నదని మండిపడ్డారు. మేమెప్పుడూ అభివృద్ధికి అడ్డుపడలేదని అభివృద్ధి మా ప్రభుత్వంలో చేసి చూపించామని తెలిపారు. రైతులు వేసుకున్న పంటలు చేతికి వచ్చే సమయంలో ఎండిపోతున్న ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ఐదు గంటలు కూడా సక్రమంగా విద్యుత్తును రైతులకు అందించలేని ఈ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. పంటలు వేసుకుని నష్టపోయిన రైతంగానికి ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని అందివ్వాలని ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లుగా రైతంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన ఘనత మాదేనని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో నీటి కొరత ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్న చీమకుట్టినట్టు కూడా ప్రస్తుత కాంగ్రెస్ నాయకులకు లేదని ఆసుపత్రిలో నీటి ఎద్దడి సమస్యను తీర్చడానికి చేతకాని వాళ్లు మాకా నీతులు చెబుతు న్నది అంటూ హెచ్చరించారు. మేము చేసిన పోరాటాలతోనే కానుకుర్తి రైతులకి గాని, పేరపళ్ళ రైతులకే గాని నష్టపరిహారం ఇప్పించడంలో కీలక భూమిక పోషించామని తెలిపారు. ఇంకా మిగిలిపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కన్నా జగదీష్, కౌన్సిలర్ భరత్, వేపూరి రాములు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో..



బోధన్, (సింగిడి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాలూరా మండల కేంద్రంలో శ్రీ సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా 6 రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను అరికట్టాలి





గద్వాల ప్రతినిధి (సింగిడి): బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహ రించాలని జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్మా పాత్రుడు పిలుపునిచ్చారు. శుక్రవారం అయిజ మండలం బింగిడొడ్డి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలబాలికకు విద్యను పొందే హక్కు ఉందని, పిల్లలను పనుల్లో పెట్టకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మికులు లేదా బాల్య వివాహాల గురించి తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు అందిస్తామని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100, బాలల రక్షణ కోసం 1098, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి సునంద మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, గ్రామస్థులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి బాలబాలికకు విద్య, రక్షణ, సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టాలి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, (సింగిడి): ఎల్‌నినో ప్రభా వంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గురువారం ఐడీఓసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో వివిధ శాఖల సన్నద్ధతపై చర్చించి, నీటిపారుదల, విద్యుత్, వ్యవసాయ, భూగర్భజల శాఖలు సమన్వయంతో



పనిచేయాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యవసాయ, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫ రాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందిం చకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వచ్చే గురువారం నిర్వహించే సమీక్షా సమావేశానికి ప్రతి శాఖ అధికారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, (సింగిడి):హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమ కొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం నుంచి దూరదృశ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. బతుకమ్మ వేడుకల్లో ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా ఘాట్ల వద్ద పారిశుద్ధ్యం, మట్టి పనులు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సర్పంచులు, పంచాయతీ కార్యద ర్శులు, మండల అధికారులు సమన్వయంతో



పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

అర్హులందరికీ సహాయక పరికరాలు...,

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏఎల్‌ఐసిఓ ఆధ్వర్యంలో దివ్యాంగుల సహాయక పరికరాల పంపిణీ పథకం కింద అర్హులను గుర్తించి, ఎవ్వరూ మిగిలిపోకుండా చర్యలు చేపట్టాలని మంత్రి తెలి పారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, లబ్ధి దారుల వివరాలను ముందుగానే సేకరించి శిబిరా లకు హాజరయ్యేలా చూడాలన్నారు. కరీంనగర్ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, హనుమ కొండ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, సిద్దిపేట జిల్లాలో మూడు మండలాలకు రెండు రోజుల చొప్పున శిబిరాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సంబంధిత జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు శిబిరాలను పర్యవేక్షిం చి, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాలు అందేలా చర్యలు తీసుకోవా లని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారికి ఓడి బియ్యం, చీరే సారే సమర్పించిన మహిళలు



జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని కృష్ణ కాలనీలో ఆదిశక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం, చీరే సారే సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏటా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు మండలేముల దుర్గాప్రసాద్ శర్మ తెలిపారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల శు భాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదిశక్తి యూత్ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కలాం సేవలు దేశానికి చిరస్మరణీయం

యువతకు ఆయన జీవితం ఆదర్శప్రాయం,

బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం



కరీంనగర్, (సింగిడి): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. కలాం జయంతి సందర్భంగా బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్రప్రధా న కార్యదర్శి ఎండీ ముజీబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం, ఎండీ ముజీబ్ మాట్లాడుతూ, కలాం గొప్ప శాస్త్రవేత్తగా, దేశభక్తుడిగా, కోట్లాది మంది యువతకు స్ఫూర్తిదాతగా నిలిచా రని కొనియాడారు. విద్యార్థుల్లో ఉన్నత ఆలోచనలు పెంపొందించేందుకు, దేశాభి వృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొ న్నారు. దేశ రక్షణ రంగానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. కలాం ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో సమీయుల్లా అహ్మద్, సైద్, ఫయాజ్, అబూబకర్, అమెర్, రౌఫ్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని కలాంకు నివాళులర్పించారు.

వాసవి ఆలయంలో మహా చండీయాగం



జమ్మికుంట, (సింగిడి):జమ్మికుంటపట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మహా చండీయాగం నిర్వహించను న్నట్లు శ్రీ వాసవిమాత సేవాదళ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మహా చండీయాగం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. భక్తులందరూ సకాలంలో ఆలయానికి చేరుకుని యాగంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ వాసవిమాత సేవాదళ్ జమ్మికుంట సభ్యులు విజ్ఞప్తి చేశారు.

కష్టాల్లో ఉన్న పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

రూ.8 లక్షల విలువైన 17 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందించిన వొడితల ప్రణవ్



జమ్మికుంట, (సింగిడి): కష్టకాలంలో పేదలకు అండగా నిలిచి, వారికి భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడిని ఆదుకుంటామని తెలిపారు.

గురువారం 'మన ఊరు-మన కాంగ్రెస్-మన ప్రణవ్' కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండలంలోని మాచనపల్లి, జగ్గయ్యపల్లి, కోరపల్లి, విలాసాగర్, నగురం, వావిలాల, నాగంపేట, శాయంపేట, మడిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధిత కుటుంబా లకు రూ. 8 లక్షల విలువైన 17 ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఆరోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని ప్రణవ్ తెలిపారు. గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కష్టకాలంలో అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రణవ్‌కు లబ్ధిదా రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, బీసీ, ఎస్సీ, మైనారిటీ, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి భక్తి గీతాలాపన పోటీలకు విశేష స్పందన

విద్యార్థుల్లో ఆధ్యాత్మిక వికాసానికి భక్తి పోటీలు దోహదం: ప్రముఖులు

కరీంనగర్, (సింగిడి): తెలుగు భాషా సంరక్షణ సంఘం జిల్లా శాఖ, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా--2047 సంయుక్త ఆధ్వ ర్యంలో శరన్నవరాత్రుల సందర్భంగా సాయి మానేరు పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి భక్తి గీతాలాపన పోటీలకు విశేష స్పందన లభిం చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధానాచా ర్యులు డాక్టర్ కె. రామకృష్ణమాట్లాడుతూ, సంగీత సాహిత్యాలు అమ్మవారి దివ్య ప్రసాదాలని, విద్యార్థులు భక్తి గీతాలతోపాటు శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసిం చాలని సూచించారు. సంఘం అధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆధ్యాత్మిక వికాసం, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. పిల్లలు భగవద్గీత శ్లోకాలను నేర్చుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు.

పోటీల్లో అభిరామ్, దీపిక, సాత్విక తొలి మూడు బహుమతులు సాధించగా, మరో నలుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాల్గొన్న విద్యార్థు లందరికీ ప్రశంసాపత్రాలు, భగవద్గీత శ్లోకాల పుస్తకాలను ప్రదానం చేశారు.



గాయకులకు సంగీతంలోని మెలకువలు నేర్పిన సంగీత ఉపాధ్యాయిని వినీల శివపురాన్ని, ముఖ్య అతిథి డాక్టర్ కె. రామకృష్ణను నిర్వాహకులు సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బొమ్మకంటి కిషన్, శాతవా హన లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎం. మహేందర్, ఎన్. వేణుగోపాల్, కె. రాజేందర్ రెడ్డి, డాక్టర్ వి. శ్రీనివాస్, పి. సురేందర్ పాల్గొన్నారు.

ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్ దే!

రాజకీయాల కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం

కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం.. మీడియాతో ప్రణవ్

జమ్మికుంట, (సింగిడి): రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజ యమని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ధీమా వ్యక్తం చేశారు. రాజకీయాల కంటే ప్రజా సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గురువా రం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా



నిలుస్తోందని ప్రణవ్ తెలిపారు. ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రజల ఆదరణే కాంగ్రెస్ పార్టీకి బలమని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఉప ఎన్నిక వస్తే కాంగ్రెస్ విజయం ఖాయం

హుజురాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తే కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ప్రణవ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్‌తో పాటు వేలాది మంది కార్యకర్తలు, మహిళల ఆశీస్సులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేస్తున్నాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హుజురాబాద్ నియోజకవర్గానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. నియోజకవర్గంలో కనీస అభివృద్ధి పనులు కూడా చేపట్టని ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏం సమాధా నం చెబుతారని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్య తనిచ్చే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగుతుందని ప్రణవ్ పేర్కొన్నారు.

వెల్దిలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

పూల బతుకమ్మలతో సందడి చేసిన మహిళలు

ఘనంగా నిర్వహించిన సర్పంచ్ కిషన్‌రావు



కరీంనగర్, (సింగిడి): మండలంలోని వెల్ది గ్రామంలో సర్పంచ్ పెంచాల కిషన్‌రావు ఆధ్వర్యంలో గురు వారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోషిని, ఉపసర్పంచ్ రుద్రవరం సాయికుమార్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. శ్రీ సిద్ధివినాయక కళాబృం దం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

జూనియర్ అసిస్టెంట్ మోహన్ యాదవ్‌కు ఘనంగా వీడ్కోలు

శాలువాతో సత్కరించిన

ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు



జమ్మికుంట,(సింగిడి): అపర భద్రాద్రిగా పేరు గాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థా నంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన కె. మోహన్ యాదవ్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థానంలో మోహన్ యాదవ్ అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు. విధుల నిర్వహణలో ఆయన చూపిన అంకితభావాన్ని కొని యాడారు. మెట్టుగుట్ట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానా నికి బదిలీపై వెళ్తున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బి. సదయ్య, గ్రామ సర్పంచ్ దార సురేష్, ఉప సర్పంచ్ రంజిత్, మాజీ చైర్మన్ ఇంగ్లే రామారావు, దేవస్థాన సిబ్బంది, మాజీ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం

ఆధునిక సాగు పద్ధతులతో ఆదాయం పెంచుకోవాలి..జిల్లా వ్యవసాయ అధికారి బి. ఛత్రు నాయక్

జమ్మికుంట, (సింగిడి):గ్రామ సవ నిర్మాణ సమితి (జీఎన్ఎన్ఎస్) ఆధ్వర్యంలోని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి బి. ఛత్రు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల పెంపుతో పాటు కుటుంబాల ఆర్థిక అభివృద్ధిలో మహిళా రైతుల పాత్ర కీలకమని అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, రానున్న రబీ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలపై మహిళా రైతులకు సూచనలు చేశారు. కేంద్రంలోని శాస్త్రవేత్తలు వివిధ వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట, వీణవంక,



హుజూరాబాద్ మండలాలకు చెందిన మహిళా రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు కలిపి 116 మంది పాల్గొన్నారు.

రూ.2.80 కోట్లతో నగరవ్యాప్తంగా వేడుకలకు సౌకర్యాలు

నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునిల్‌రావు

కరీంనగర్, (సింగిడి):బొమ్మకల్‌లో ఏడు రోజుల సద్దుల బతుకమ్మ వేడుకలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం డిప్యూటీ మేయర్ యాదగిరిసునీల్‌రావు, అధికారులతో కలిసి బతుకమ్మఆడే ప్రదేశాలు, చెరువు వద్ద నిమజ్జన ఘాట్‌ను ఆయన పరిశీలించారు. బతుకమ్మ వచ్చే మహిళలు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, ధ్వని వ్యవస్థ, బారికేడ్లు, తాగునీటి వసతి, పారిశుధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, ఆనందో త్సాహాలతో జరుపుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక ఆచారాలకు అనుగుణంగా తొమ్మిది, ఏడు రోజులపాటు నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల కోసం రూ. 2.80 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.బొమ్మకల్ నిమజ్జన ఘాట్ వద్ద అధికారులు, పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. మహిళలు తీరొక్క పూలతో



బతుకమ్మలను పేర్చి, ఉయ్యాల పాటలతో వేడుకల్లో పాల్గొని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని ఆకాంక్షించారు. బొమ్మకల్ ప్రజ లకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొ రేటర్ మేకల వెంకటేష్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో కార్మిక గర్జన..

కార్మికుల ఆగ్రహానికి అద్దం పట్టిన సభ..

హక్కుల కోసం సమరశంఖం!

ప్రభుత్వ విధానాలపై కార్మిక వర్గం అసంతృప్తి: కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్

గోదావరిఖని (సింగిడి)::సింగరేణి గడ్డపై కార్మిక గర్జన సభ కార్మిక శక్తిని చాటిచెప్పిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్మిక గర్జన సభకు లభించిన స్పందన ప్రభుత్వ విధానాలపై కార్మిక వర్గంలో ఉన్న అసంతృప్తిని ప్రతిబింబించిందని వ్యాఖ్యానించారు.

కార్మికుల స్పందనతో సభ విజయవంతం

కార్మిక గర్జన సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన కార్మిక సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు, స్థానిక ప్రజలకు కొప్పుల ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారన్న సమాచారంతో ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారని పేర్కొన్నారు. సింగరేణిలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి



కనిపిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలు, కార్మికుల హక్కులపై బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం

సింగరేణి చరిత్రలో కార్మిక గర్జన సభకు ప్రత్యేక స్థానం ఉంటుందని కోరుకంటి చందర్ అన్నారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికులకు ఇచ్చిన హామీల అమలు, వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

కార్మిక సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు కార్మిక వర్గం ఏకమవుతోందని చందర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ ప్రాంతం నుంచి కార్మికుల పక్షాన గళమెత్తడం ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా, ఏ సమస్య ఎదురైనా బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

కార్మికుల గొంతుకగా బీఆర్ఎస్

సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ఐక్యతే తమ బలమని, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కరువు విలయతాండవం

ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. ప్రభుత్వ వైఫల్యమే కారణం... బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ విమర్శలు

జమ్మికుంట, (సింగిడి): రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితు లకు ప్రకృతి వైపరీత్యాలు మాత్రమే కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందుచూపు లేమి కూడా కారణమని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ విమర్శించారు. గురువారం హుజురాబాద్‌లో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పందలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా, ఆ నీటిని సద్వినియోగం చేసుకునే ప్రణాళిక ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరమన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సాగు, తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు విద్యుత్ కష్టాలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని, విద్యుత్ హెచ్చుతగ్గులతో వ్యవసాయ పంపుసెట్లు దెబ్బతిని నష్టపోతు న్నారని అన్నారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు సైతం విద్యుత్



సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించకుండా ఢిల్లీ పర్యటనలకే పరిమితమైతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గందె శ్రీనివాస్, ఇరుమళ్ల సురేందర్ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, కటుకూరి మల్లారెడ్డి, వర్ధినేని రవీందర్ రావు, తాళ్లప

ఉద్యోగుల డిమాండ్లను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

ఎన్ హెచ్ఎం సిబ్బంది ధర్నాకు ఎమ్మెల్యే ధన్ పాల్ మద్దతు



నిజామాబాద్ (సింగిడి): ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను వచ్చే అసెంబ్లీ సమా వేశంలో ప్రస్తావిస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కొనసా గుతున్న ధర్నాకు గురువారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేసినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ఉద్యోగులంతా న్యాయమైన డిమాండ్లను కోరుతున్నా రని వారికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నానన్నారు. ముఖ్యంగా ఇంక్రిమెంట్లతో పాటు బోనస్ కూడా ప్రకటించాలన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగి మరణించినట్లయితే ఇన్సూరెన్స్ తో కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి ఉద్యోగం కల్పించాలన్నారు. ధర్నాలు ఎన్ హెచ్ ఎం జిల్లా అధ్యక్షులు సందీప్, నారాయణ, అక్షయ్, విశాల తదితరులు పాల్గొన్నారు.

దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు



కల్వకుర్తి,(సింగిడి):దుర్గా భవాని యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గా భవాని అమ్మవారిని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నిర్వహి స్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమశీలో, మాజీ ఎంపీపీ చెదురుపల్లి వెంకటయ్య గౌడ్, పోతేపల్లి సర్పంచ్ కొండల్ యాదవ్ జూపల్లి సర్పంచ్ అనూష జగపతి, మాజీ సర్పంచ్ పాలాది మల్లీశ్వరి బాలరాజు, భాస్కర్ రావు యువసేన అధ్యక్షుడు ఎండీ సిరాజ్, గ్రామ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో సుఖసంతోషాలు, సౌభాగ్యం, శాంతి నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి



గద్వాల బ్యూరో (సింగిడి): పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, జిల్లా నోడల్ అధికారి పౌసుమి బసు సూచించారు. గురువారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లాలో పథకం పురోగతిని వివరించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యీకరణ, సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని పౌసుమి బసు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఒక మండలాన్ని సమూనాగా ఎంపిక చేసి పంటల మార్పిడి, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్స హించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా సహకారం అందించాలని తెలిపారు. జిల్లాలో యూరియా వినియో గం తగ్గడం అభినందనీయమని, ఇందుకు దోహదపడిన ఉత్తమ పద్ధతులను కేస్ స్టడీ రూపంలో రూపొందించాలని ఆదేశించారు. వెనుకబడిన సూచికల్లో పురోగతి సాధించి, లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పేర్కొ న్నారు. పశుసంవర్ధక, మత్స్య రంగాల అభివృద్ధితో పాటు మహిళా సంఘా లు, సూక్ష్మ ఆహార పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ అధికారి ముషాయిదా బేగం, జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్‌కుమార్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్ వాడిల చలో హైదరాబాద్ కు అనుమతి ఇవ్వాలి



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):అంగన్ వాడి ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని 26వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనటానికి అనుమతించాలని జిల్లా ఐసిడిఎస్ పీడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ స్కీం వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు జరపాలని, అందులో భాగంగా అంగన్వాడీలకు 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్ అయిన వారి అందరికి రెండు లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ లను రాష్ట్రంలో అమలు జరపకూడదని నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని 26వ తేదీన జరిగే మహా ధర్నాలు, జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్ణయించినట్లు అందువల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ ఉద్యోగులు జయప్రదం చేయాలని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి చంద్రకళ, నాయకులు కవిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవి అలంకరణలో వాసవిమాత దర్శనం

ప్రత్యేకపూజలు పాల్గొన్న ఎస్పీ దంపతులు.. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: జిల్లా ఎస్పీ





నాగర్ కర్నూల్ (సింగిడి):నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం వాసవి కన్యకాపరమేశ్వరి మూల విరాట్‌కు శ్రీ లలితా దేవి అలంకరణ చేపట్టారు. ప్రాత:కాల పూజలలో భాగంగా దంపతీయుక్తంగా ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ దంపతులు పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆర్యవైశ్య నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు అనంతరం దంపతులను సన్మా నించారు. ఎస్పీ మాట్లాడుతూ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ సుఖసంతోషాలతో జీవించాలని కోరారు.

అనంతరం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమం లో విశేషంగా భక్తులు పాల్గొనగా ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ఉత్సవ విగ్రహాలకు గణపతి సుబ్ర హ్మణ్యం దుర్గ సరస్వతి లక్ష్మీ హోమాలను పూర్ణాహుతి నిర్వహించి మహా నీరాజనం సమర్పించారు .సాయం కాల ప్రదోష పూజ అనంతరం ఉత్సవ విగ్రహాలకు హారతి పల్లకి సేవ డోలో ఉత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘాలు ఆర్యవైశ్య ప్రముఖులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నడిగడ్డ వాగులో అక్రమ ఇసుక డంపు సీజ్!

15 టిప్పర్ల ఇసుక స్వాధీనం..

తరలింపు సమయంలో సర్పంచ్, తహసీల్దార్ మధ్య వాగ్వాదం..





నాగర్ కర్నూల్ (సింగిడి):నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డ ప్రాంతంలోని వాగులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును తహసీల్దార్ విజయకుమార్ ఆధ్వర్యంలో అధికారులు సీజ్ చేశారు.తహసీల్దార్ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు నడిగడ్డ ప్రాంతంలోని వాగులో అక్ర మంగా ఇసుక డంపు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికా రులతో కలిసి అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీల్లో సుమారు 15 టిప్పర్లకు సరిపడా ఇసుకను అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను సమీపంలోని చిన్నముద్ద నూరు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో నిల్వ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఇసుకను సీజ్ చేసి, ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



ఇసుక తరలింపుపై వాగ్వాదం..

అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను తరలించే క్రమంలో నడిగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్, తహసీల్దార్ విజయ కుమార్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఇసుక డంపు వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

చిమ్మపూడిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహిళా రైతులకు శిక్షణ



ఖమ్మం, (సింగిడి):: మహిళా రైతుల వ్యవసాయ రంగంలో భాగస్వా మ్యాన్ని గుర్తిస్తూ, వారి సాధికారత మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు గురువారం చిమ్మపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహిళా కిసాన్ దివాస్ – 2026 కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కోటేరు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి. సరిత మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో మహిళా రైతుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. మహిళా రైతులు ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెం పొందించుకుంటూ, వాటిని తమ వ్యవసాయంలో అమలు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.మహిళా రైతులు సంఘటితమై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని, తమ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు చేపట్టి మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవ చ్చని వివరించారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం , వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, అందు బాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ అపరాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని మహిళా రైతులకు సూచించారు. రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏడీఏ వాణి మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల్లో తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, ముఖ్యంగా మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ పంట ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలను మహిళా రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ కోటేరు నర్సిరెడ్డి మాట్లాడుతూ, మహిళా రైతులు లేనిదే గ్రామీణ వ్యవసాయాన్ని ఊహించలేమని పేర్కొన్నారు. విత్తనం విత్తడం నుంచి పంట కోత వం–కు వ్యవసాయంలోని అనేక కీలక పనుల్లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళా రైతులు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకొని కుటుంబ ఆదాయం, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కార్యక్రమం వ్యవసాయ అధికారి అరుణ జ్యోతి, రఘునాధపాలెం మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి కార్తీక్, చిమ్మపూడి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ శేఖర్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

జర్నలిస్టుల కలం గొంతు నొక్కితే సహించేది లేదు:

వెంకటస్వామి టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నాగర్ కర్నూల్ (సింగిడి):జర్నలిస్ట్ పోత్తూరు శేఖర్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి,ఆరోపణలు ఎదు ర్కొంటున్న గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్‌పై చట్టప్ర కారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటస్వామి డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర మని, ప్రజల పక్షాన ప్రశ్నించే కలాన్ని అణచివేయడం సహించేది లేదని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు ఆరోపణలు



రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన ఇద్దరు రైతుల వ్యవహారంలో భాగంగా, కరీం నగర్‌లో నివసిస్తూ ఒక ఈ–పత్రికను నిర్వహి స్తున్ననూకలమర్రి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ పోత్తూరు శేఖర్‌తో పాటు మరో జర్నలిస్ట్ సంపత్‌ను గంభీరా వుపేట పోలీసులు తీసుకెళ్లి నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎస్ఐ శ్రీకాంత్ ఇద్దరు జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిం చినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా వారి శరీరాలపై గాయాలను గమనిం చిన న్యాయమూర్తి వాంగ్మూ లాలను నమోదు చేసుకు న్నట్లు సమాచారం. వారిని రిమాండ్‌కు పంపకుండా ఆసుపత్రికి తరలిం చాలని ఆదేశించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇద్దరూ కరీంనగర్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక రక్షణ చట్టాలను తీసుకురావాలని వెంక టస్వామి ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులు నిర్భయంగా విధులు నిర్వహించే వాతావర ణాన్ని కల్పించాలని, శేఖర్ ఘటనపై నిష్పక్ష పాత విచారణ జరిపి,ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాటిన ప్రతిమొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ

ఏపీవో నాగరాజు

కోడేరు (సింగిడి):కోడేరు మండల పరిధిలోని తీగలపల్లి గ్రామపంచాయతీలో వీబీజీ రాంజీ పథకం ద్వారా చేపట్టిన మొక్కల పెంపకం పనులను ఏపీఓ నాగరాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలకు కంచెలు ఏర్పాటు చేసే విధానాన్ని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మొక్కలను పెంచుకోవడం వలన మానవులకు కావలసిన ప్రాణవాయువు ఆక్సిజన్ తో పాటు చెట్లు విరివిగా పెరిగి మేఘాలను ఆకర్షించి వర్షము కురిసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన సూచించారు నాటిన ప్రతి మొక్క పెద్దగా ఎదిగిన తర్వాత మనకు కావాల్సిన ప్రతిఫలాన్ని ఇస్తుందని ఆయన కూలీలతో అన్నారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య కూ లీలు పాల్గొన్నారు



యువతకు స్ఫూర్తి.. భారత శాస్త్ర విజ్ఞానానికి దిక్సూచి అబ్దుల్ కలాం

నాగర్‌కర్నూల్‌లో ఘనంగా భారతరత్న కలాం జయంతి వేడుకలు



నాగర్‌కర్నూల్, (సింగిడి): భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను గురువారం నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 1931 అక్టోబర్ 15న తమిళనా డులోని రామేశ్వరంలో నిరుపేద కుటుంబంలో జన్మిం చిన అబ్దుల్ కలాం ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. చిన్నత నంలో పేపర్ బాయ్‌గా పనిచేస్తూ విద్యాభ్యాసాన్ని కొనసాగించిన ఆయన.. అకుంఠిత దీక్ష, కఠోర శ్రమ, నిరంతర అధ్యయనంతో దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదిగారని పేర్కొన్నారు.డీఆర్‌డీఓ, ఇస్రో సంస్థల్లో పనిచేసిన కలాం.. భారతదే శాన్ని అంతరిక్ష రంగంలో సత్తా చాటే దేశాల సరసన నిలపడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. అగ్ని, పృథ్వి వంటి క్షిపణుల రూపకల్పనలో విశేష కృషి చేసి, దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించినందుకే ఆయన 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండి యా'గా ప్రసిద్ధి చెందారని గుర్తుచేశారు. విద్యార్థుల పట్ల ఆయనకు ఉన్న అపారమైన ప్రేమ, యువతను ప్రోత్సహించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కార్య క్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశెట్టి, మండల అధ్యక్షుడు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి యుగంధర్ రెడ్డి, పాండు, వెంకట్ రెడ్డి, సాయిరెడ్డి, సుదర్శన్ గౌడ్, సంజీవ గౌడ్, పాండురంగయ్య, యాదగిరి తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ స్వచ్ఛ జలధార



కల్వకుర్తి (సింగిడి): ప్రజలకు స్వచ్ఛమైన, పరిశు భ్రమైన తాగునీటిని అందించ డంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన "స్వచ్ఛ జలధార" కార్యక్రమం మూడవ విడతలో భాగంగా గురువా రం కల్వకుర్తిలోని మున్సిపాలిటీ 3వ వార్డులో తాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబా టులో ఉండాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్ర మంలో భాగంగా జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేశారు. ట్యాంకుల్లో పేరుకు పోయిన మురికి, ఇతర వ్యర్థాలను ప్రత్యేక యంత్రా ల ద్వారా తొలగించి, శాస్త్రీయ పద్ధతుల్లో పరిశు భ్రత చర్యలు చేపట్టారు. తాగునీటి నిల్వ ట్యాం కులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే లక్ష్యంతో ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశలవారీగా కార్యక్రమంప్రజారోగ్యా నికి స్వచ్ఛమైన తాగునీరు ఎంతో కీలకమని భావిస్తూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ జలధార" కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవ ర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో దశలవారీగా నిర్వహించనున్నారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రజలకు పరిశు భ్రమైన నీరు అందేలా అవసరమైన చర్యలకు సహకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.సామాజిక సేవలో భాగంగా ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ రాము నాయక్, ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు శ్రీను నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు శంకర్, తిరుపతి, రాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చలికాలంలోనూ ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి:

జిల్లా వైద్యా , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు.

ఖమ్మం, (సింగిడి): చలికాలం ప్రారంభమైనప్పటికీ పగటిపూట ఎండ తీవ్రత వల్ల ప్రజలు ఆరో గ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖమ్మం జిల్లా వైద్యా మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఉదయం, సాయంత్రం చల్లని వాతావర ణం ఉన్నప్పటికీ మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులను బట్టి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

–ఎండ తీవ్రతతో కలిగే ఆరోగ్య సమస్యలు

ఎండలో ఎక్కువసేపు పనిచేయడం లేదా తిరగడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గడం, అధిక దాహం, నీరసం, తలనొప్పి, తల తిరగడం, కండరాల నొప్పులు వంటి సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. తీవ్రమైన సందర్భాల్లో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:



రోజంతా తగినంత నీరు తాగాలి. దాహం వేయకపో యినా కొద్దికొద్దిగా నీరు తాగుతూ ఉండాలి. మధ్యా హ్నం సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు అత్యవసరం కాని బయట పనులను తగ్గించుకోవాలి– బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ ఉపయోగిం చాలి. వీలైనంత వరకు తేలిక పాటి, వదులుగా ఉండే లేత రంగు దుస్తులు ధరించాలి, ఎక్కువసేపు ఎండలో పనిచేసేవారు తరచుగా నీడలో విశ్రాంతి తీసుకోవాలి,శరీరంలో నీటి లోపం ఏర్పడం వల్ల సోడియం లెవెల్స్ పడిపోయి పోవడం జరుగుతుంది, కావున మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవాలని, తగిన ద్రవ పదార్థాలు తీసుకోవా లిని,అవసరమైన సందర్భాల్లో వైద్యుల సూచనల మేరకు ఓఆర్ఎస్ ద్రావణం ఉపయోగించాలిని, చిన్నపిల్లలు, వృద్ధులను ఎక్కువసేపు ఎండలో ఉంచకూడదు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే తక్షణ వైద్య సహాయం పొందాలి అని,శరీర ఉష్ణోగ్రత బాగా పెరగడం, గందరగోళం, స్పృహ కోల్పోవడం, మూర్ఛ వంటి లక్షణాలు వడదెబ్బకు సంకేతాలు కావచ్చని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలి అని బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించి, శరీరాన్ని చల్లబరిచే చర్యలు చేపట్టాలి. స్పృహ లేని వ్యక్తికి నోటి ద్వారా నీరు లేదా ఇతర ద్రవాలు ఇవ్వకూ డదు అని,ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఏవైనా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని జిల్లా వైద్యా మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు.

గ్రామీణ మహిళా కూలీలకు రోజుకు రూ.920 వేతనం చెల్లించాలి

భూమిలేని పేద కుటుంబాలకు 5ఎకరాల భూమి ఇవ్వాలి



గద్వాల ప్రతినిధి (సింగిడి): అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జోగులాంబ గద్వాల జిల్లా మల్లకల్ మండలం మద్దెలబండ పెద్ద తండాలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 55 మంది మహిళా కూలీలు పాల్గొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ జి. నర్సింలు, జిల్లా మహిళా కోఆర్డినేటర్ టీ. పద్మ, జిల్లా యువజన కోఆరి నేటర్ ఎం. వినోద మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన గౌరవం, భద్రత కల్పించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలను అరికట్టేం దుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మహిళా కూలీలకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో నిరంతరం పని కల్పించాలని, స్త్రీ పురుషులకు సమానంగా రోజుకు రూ. 920 వేతనం చెల్లించాలని కోరారు. భూమిలేని నిరుపేద కూలీ కుటుంబాలకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలని, ప్రమాదవశాత్తు మరణం లేదా ప్రమాదాలు సంభవించినప్పుడు రూ. 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వీబీ–జీ రామ్‌జీ చట్టం కింద ప్రతి కూలీకి సంవత్సరానికి 200 రోజుల పని కల్ప

గంగుల చొరవతో రూరల్ మండలానికి సాగునీరు

కేసీఆర్, గంగుల కమలాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన రైతులు



కరీంనగర్, (సింగిడి): సాగునీటి కోసం మాజీ మం త్రి, కరీం నగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన కృషితో రూరల్ మండలానికి నీరు చేరడంతో నగునూరు, ఇరుకుల్ల గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీ-86 కాలువ వద్ద నీటిలోకి దిగి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ, పంటలు ఎండిపోయే పరిస్థితుల్లో సాగునీటి సమస్యను గుర్తించిన గంగుల కమలాకర్ స్వయంగా చొప్పదండికి వెళ్లి నీటి నియంత్రణ గేట్లు ఎత్తించి నీటిని విడుదల చేయించారని తెలిపారు. ఆయన చొరవతోనే మండలానికి సాగునీరు అందిందని, పంటలను కాపాడుకునేందుకు అవకాశం కలిగిందని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరుకుల్ల సర్పంచ్ రమేష్ గౌడ్, రైతు నాయకులు మోహన్ రెడ్డి, వెంకటయ్య, సుమన్, మాజీ ఎంపీటీసీలు రామ్ రెడ్డి, భద్రయ్య, శ్రీనివాస్, రవితేజతో పాటు గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డంపుయార్డు సమస్యపై
రాజకీయాలు వద్దు!

రోజుకు 2 వేల మెట్రిక్ టన్నుల చెత్త తొలగిస్తే ఏడాదిలో పరిష్కారం సాధ్యం, అందరం కలిసి కట్టుగా సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం

సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్, (సింగిడి): డంపుయార్డు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాజకీయ లబ్ధి కోసం పరస్పరం విమర్శలు చేసుకోవడం సరికాదని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సమస్య పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపుయార్డులో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, రోజూ మరో 200 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతోందని తెలిపారు. రోజుకు 2 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేస్తే ఏడాదిలో డంపుయార్డును ఖాళీ చేయవ చ్చని, ఇందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. గతంలోనే స్మార్ట్ సిటీ నిధులతో చెత్తను తొలగించే అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించలేదని విమర్శించారు. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, పట్టణాభివృద్ధి నిధులు త్వరగా మంజూరయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంపై పర్యవేక్షణ పెంచాలని, డంపుయార్డు పొగను నియంత్రించేందుకు నాలుగు వైపులా బోర్లు వేసి నీటిని పిచికారీ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజ్, కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, వరాల నర్సింగం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, ఎండీ చాంద్, దండి రవీందర్, గుడిపాటి రమణారెడ్డి, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు వేయొద్దనడం సిగ్గుచేటు!

ఎల్‌నినోను ఎదుర్కొనే ప్రణాళిక ఏది? ప్రభుత్వాన్ని ప్రశ్నించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కరీంనగర్, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థి తులు ఏర్పడే అవకాశం ఉందంటూ రైతులను ఆం దోళనకు గురిచేయ కుండా, ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికను వెల్లడించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. యాసంగి పంటలు వేయొద్దని ముఖ్యమంత్రి, మంత్రులు సూచించడం సిగ్గుచేటని విమర్శించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో రైతులకు నాలుగు గంటలే విద్యుత్తు సరఫరా అవుతోందని, కోతల వల్ల పంటలకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. జనరేటర్ల వినియోగంతో రైతులపై అదనపు భారం పడుతోందన్నారు. పంటల సాగు విరామం ప్రకటిస్తే ఎకరానికి రూ. 30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాణహిత, గోదావరి నదులు ఉన్నప్పటికీ సాగునీటి సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి, ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి లభ్యతకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు నిరంతర విద్యుత్తు, మూడు పంటలకు రైతుభరోసా, ఎకరానికి రూ. 15 వేల సాయం వంటి హామీలను అమలు చేయాలని కోరారు. విద్యుత్తు ఉత్పత్తి, బొగ్గు సరఫరాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సబ్‌స్టేషన్ల ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవాహన విశ్వవిద్యాలయ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఇన్‌చార్జి చుక్కాశ్రీనివాస్, మాజీ సర్పంచులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి ఒక రక్తదాత..
ప్రతి ప్రాణానికి ఒక ఆశ!

రక్తదాన, రక్తగ్రూపింగ్‌తో పాటు ఉచిత వైద్య శిబిరం



కరీంనగర్, (సింగిడి): స్వచ్ఛంద రక్తదా నంపై అవగాహన కల్పించడం తో పాటు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో కాల్‌ఫర్‌బ్లడ్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో, ఓల్డ్ బజార్ ఫ్రెండ్స్ యూత్ సహకారంతో రక్తదాన, రక్తగ్రూపింగ్ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు.. ఎంజీఆర్ రక్తనిధి, మెడికవర్ ఆసుపత్రి భాగస్వామ్యంతో కరీంనగర్ పాతబజార్‌లోని చిన్న హనుమాన్ దేవాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహ పరీక్షలు, గుండె విద్యుత్‌చిత్ర పరీక్షతో పాటు వైద్యుల సంప్రదింపుల సేవలను అందించారు. కాల్‌ఫర్‌బ్లడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతల సంపత్ మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో రక్తదాతల కోసం వెతకకుండా ముందుగానే స్వచ్ఛంద రక్తదాతల వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు రక్తదానంపై అవగాహన పెంచుకుని, వైద్యపరంగా అర్హులైనప్పుడు రక్తదానం చేసేలా ప్రోత్సహించడమే 'ప్రతి ఇంటి నుంచి ఒక రక్తదాత' ఉద్యమ లక్ష్యమని తెలిపారు. రక్తదాతల నమోదు, అవసరమైన సమయంలో దాతలను గుర్తించి అనుసంధానించడంలో సాంకేతికతను వినియోగిస్తున్నామని, దాతల వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. రక్తదానంపై అపోహలను వీడి, అర్హులైన వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్‌బజార్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సాయి దీక్షిత్, నవీన్, అర్జున్, గణేష్, అజిత్, గిరి, సాయి చరణ్, సాయి ధీరజ్, నిఖిల్‌తో పాటు కమిటీ సభ్యులు, రక్తనిధి ప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. శిబిరం విజయవంతానికి సహకరించిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

జమ్మికుంట అభివృద్ధికి వ్యాపార సంస్థలు దోహదం

గరుడ వస్త్ర సిల్క్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



జమ్మికుంట, (సింగిడి) జమ్మికుంట పట్టణంలో నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన గరుడ వస్త్ర సిల్క్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణం చుట్టుపక్కల అనేక గ్రామాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పట్ట ణంలో ఆధునిక షాపింగ్ సంస్థలు ఏర్పాటు కావడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాపార సంస్థలతో జమ్మి కుంట పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సి లర్లు, డాక్టర్ తిరుపతి, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దుర్గామాత నిమజ్జనాలకు రూ.3కోట్లతో ఏర్పాట్లు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు... నగరంలోని వేడుకల ప్రదేశాలను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, (సింగిడి) సద్దుల బతు కమ్మ వేడుకలు, దుర్గామాత విగ్రహాల నిమజ్జ నాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించేం దుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 3 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి నగరంలోని బతుకమ్మ పాయింట్లు, నిమజ్జన ప్రాంతాలను మేయర్ పరిశీలించారు. మానేరు డ్యామ్, మార్కండేయ నగర్, శివనగర్, సప్తగిరి కాలనీ, గౌతమి నగర్‌తో పాటు కొత్తపల్లి, గోపాల్‌పూర్, దుర్శేడ్ తదితర ప్రాంతాల్లో ఏర్పా ట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని 66 డివిజన్ల పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణ, ధ్వని వ్యవస్థ, వేదికలు, బారికేడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక పారిశుధ్య చర్యలతో పాటు గజ ఈతగాళ్లు, అవస రమైన సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. మహిళలు, భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 21న జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జనాల కోసం మానకొండూర్, కొత్తపల్లి చెరువులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్కడ భారీ క్రేన్లు, విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, పారిశుధ్య సదుపా యాలు కల్పిస్తామన్నారు. మండపాల నిర్వాహ కులు నిర్దిష్ట నిమజ్జన ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసి, వేడుకలు సురక్షితంగా జరిగేం దుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మున్సిపల్ చైర్మన్, కమిషనర్



జమ్మికుంట, (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శు క్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో మెప్మా ఆధ్వర్యాన ఈ ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మను పూలతో అందంగా అలంకరించి, దాని చుట్టూ తిరుగుతూ మహిళలు సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ చప్పట్లతో బతుకమ్మ ఆటలు ఆడారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మల్లీశ్వరి మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొ న్నారు. మహిళలందరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా టీఎల్ఎఫ్ ఓబీలు కవిత, జ్యోతి, సీఆర్పీలు జ్యోతి, మంజుల, టీఎల్ఎఫ్ ఆర్పీ స్రవంతి, ఇతర ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.

ఘనంగా పొనగంటి మల్లయ్య జన్మదిన వేడుకలు
శివాలయంలో మహా అన్నదానం





జమ్మికుంట, (సింగిడి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జమ్మికుంట మాజీ సర్పంచ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నగంటి మల్లయ్య జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనం గా నిర్వహించారు. శుక్రవారం మల్లయ్య పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుం కరి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం శాలువాతో మల్లయ్య ను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మల్లయ్య మాట్లాడుతూ, తనపై అభిమా నంతో నా పుట్టినరోజు వేడుకలను అట్టహాసంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు నా ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలుపుతు న్నానని అన్నారు. పుట్టినరోజు సందర్భంగా శివాలయంలో అన్నదానం చేయడం సంతోషంగా ఉందని భవిష్య త్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పొనగంటి కి శుభాకాంక్షలు తెలిపిన ప్రణవ్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య పుట్టినరోజు సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ బాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తిని పించారు. హైదరాబాద్ లోని ప్రణవ్ నివాసంలో మల్లయ్య ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ మరియు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, దుబ్బ మల్లన్న దేవస్థానం చైర్మన్ ముద్దు మల్ల రవి, జమ్మికుంట వేసే మార్కెట్ డైరెక్టర్ మానుపాటి సూర్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు గూడపు సారంగపాణి, 26 వార్డ్ కౌన్సిలర్ దిడ్డి రాము, 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణు వర్ధన్, 5వ వార్డ్ యాట్ల సునీత అశోక్ కౌన్సిలర్, 15వ వార్డు కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్, కన్నా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పొనగంటి రవీందర్, మాజీ కౌన్సిలర్ జమ్మికుంట దొడ్డి సదానందం, యూత్ కాంగ్రెస్ నాయకులు గంగా రపు మహేష్, రోమాల రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల ప్రవీణ్, మహేష్ ప్రణయ్, సుంకర విశ్వంత్, ఎర్రం నవదీప్ రెడ్డి, ఎర్రం సాత్విక్ రెడ్డి,

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోరపల్లి విద్యార్థులు

జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులు..



జమ్మికుంట, (సింగిడి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 11న కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థుల్లో ఎనిమిదో తరగతికి చెందిన పి. అక్షర, పి. సాయి నవిత, పి. సాయి మణితేజ ఉన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా భగీరథ కాలనీలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరగనున్నాయి. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు జి. శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజిత, సర్పంచ్ మధుసూదన్, మండల విద్యాధికారి ఎం. హేమలత, ఉపసర్పంచ్ రాజు యాదవ్ విద్యార్థులను అభినందించారు. గ్రామ యువకులు, గ్రామస్థులు సైతం విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు.

గాంధీ విగ్రహానికి అడ్డుగా ఫ్లెక్సీలు

అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఆర్యవైశ్య సంఘం వినతి





జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్రహం కనిపించకుండా అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విచారకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని కోరారు. నిబంధనలు ఉల్లం ఘించిన వారికి జరిమా నాలు విధించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సం ఘం పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొండ్ల నాగేష్, కోశాధికారి చిదురాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధే లక్ష్యం

38వ డివిజన్‌లో రూ.24 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మేయర్ కొలగాని శ్రీనివాస్,ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, (సింగిడి): నగరంలోని అన్ని డివిజన్లను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తమ పాలకవర్గం లక్ష్యమని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 38వ డివిజన్ అమీర్‌నగర్, గాయత్రీ నగర్ లో ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ దేవ సాని సరస్వతి సత్యనారాయణతో కలిసి రూ. 24 లక్షల నగరపాలక సంస్థ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థా పన చేశారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయా లని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లా డుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో నగరంలో విస్తృ తంగా అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలి పారు. ఇప్పటికే పట్టణ మౌలిక సదు పాయాల అభివృద్ధి నిధులతో పనులు చేపట్టామని, మరో రూ. 30 కోట్లతో అదనపు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్న ట్లు వెల్లడించారు. పట్టణ సవాళ్ల నిధుల పథకం కింద రూ. 840 కోట్ల నిధులు సాధించా మని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు స్వచ్ఛ భారత్ పథకం కింద రూ. 17 కోట్లతో చెత్త శుద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతరం డివిజన్‌లోని దుర్గామాత మండపాన్ని సందర్శించిన మేయర్, ఉప మేయర్ ప్రత్యేక పూజలు చేశారు. మండప నిర్వాహకులు వారిని సత్కరించారు. మండప నిర్వా హకులు వేఘన శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కార్య క్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్,దేవసాని సరస్వతి సత్యనారాయణ, కేపీపీ చంద్ర, పోలీస్ సత్తన్న ,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

"పైడిపల్లి"కి దక్కిన
అరుదైన గౌరవం

పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చంద్రమోహన్



జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పైడిపల్లి చంద్రమోహన్ పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అక్టోబర్ 15 16వ తేదీలలో నల్గొండ జిఎం గార్డెన్ లో నిర్వహించిన పిఆర్టియు రాష్ట్ర ఆరవ కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పైడిపల్లి చంద్రమోహన్ ను ఏకగ్రీ వంగా నియమించారు. ఈ సందర్భంగా చంద్ర మోహన్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపా రు. పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తా నని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పిఆర్టియు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గండు కృష్ణమూర్తి ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ కు మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకట్ రెడ్డి ,మధు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పలువురు సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మానకొండూర్ మార్కెట్ కమిట

చైర్మన్‌గా రేవెల్లి రాజలింగం

వైస్ చైర్మన్‌గా రేమిడి శ్రీనివాస్ రెడ్డి, నూతన పాలకమండలి నియామకం



కరీంనగర్, (సింగిడి): మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌గా రంగపేటకు చెందిన రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్‌గా ఊటూరుకు చెందిన రేమిడి శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. పాల కమండలి సభ్యు లుగా ఎర్రోళ్ల కవిత, తమిశెట్టి రాజేష్, రామినేని రామయ్య, కనకం అశోక్, రాపాక రాజేశ్వర్, కుంభం చిరంజీవి, కొత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల సంపత్ రెడ్డి, ముక్కెర సతీష్ కుమార్, ఏ. రామాంజనేయ, దూలం వీరస్వామి, విశ్వనాథుల వీర కుమార్ నియమితు లయ్యారు. నూతన పాలకమండలికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు, ప్రజాసం ఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్, వైస్ చైర్మన్.. రైతుల సంక్షేమానికి, మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా

తిప్పారపు తుకారాం



జమ్మికుంట, (సింగిడి): పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి జిల్లా మోట్లపల్లి జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో గణిత స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిప్పారపు తుకారాం నియమితులయ్యారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో నల్లగొండలోని జీఎం గార్డెన్స్‌లో నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర ఆరవ కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన ఎన్నికల్లో ఆయనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి బట

singidinews@gmail.com

సిన్మా సింగిడి Cinma Singidi

ఆదివారం
18-10-2026

సినీ ఇండస్ట్రీలో విషాదం..
ప్రముఖ సంగీత దర్శకుడు దేవా కన్నమూత



సినిమా ఇండస్ట్రీలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ సంగీత దర్శకుడు దేవా (75) కన్నుమూశారు. చిత్రసీమలో తనదైన సంగీతంతో ప్రత్యేక ముద్ర వేసిన ఆయన శనివారం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతు తుదిశ్వాస విడిచారు. చెన్నైలోని మైలాపూర్‌లో జన్మించిన దేవా.. తమిళం, తెలుగు, మలయాళం భాషల్లో ఏకంగా 400 కంటే ఎక్కువ సినిమాలకు సంగీతం అందించారు. 1986లో వచ్చిన 'మాట్టుక్కార మన్నన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత ప్రశాంత్ నటించిన 'వైగాసి పొరంధాచ్చు' సినిమాతో ఆయనకు మంచి గుర్తింపు లభించింది.

తెలుగులో సంగీతం అందించిన చిత్రాలు:

తెలుగులో ప్రేక్షకులకు ఆయన సంగీతం అందించిన చిత్రాల్లో తొలిప్రేమ, మాస్టర్, ఆటోడ్రైవర్, ప్రేమ లేఖ, భాషా, పంచతంత్రం, నాగ వంటి సినిమాలు ఉన్నాయి. దేవా తన సోదరుడు చంద్రబోస్‌తో కలిసి ఒక మ్యూజిక్ బ్యాండ్‌ను కూడా నడిపేవారు. తమిళ సినిమాలో 'గానా పాటలు' అనగానే దేవాయే గుర్తుకొచ్చేంతలా ఆయన తన మార్కును క్రియేట్ చేశారు. ఇళయరాజా వంటి దిగ్గజ సంగీత దర్శకులు ఏలుతున్న కాలంలోనూ దేవా తన ప్రత్యేకమైన మ్యూజిక్ స్టైల్‌తో సుదీర్ఘకాలం పాటు సొంత సామ్రాజ్యాన్ని ఏలారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఓటీటీలోకి రాబోతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బత్త'..
స్ట్రీమింగ్ ఎప్పటినుంచంటే?



కోలీవుడ్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి సినిమాల ఎంపికలో ఎప్పుడూ డిఫరెంట్‌గానే ఉంటారు. ఒకవైపు హీరోగా వైవిధ్యమైన కథలతో అలరిస్తూనే, మరోవైపు ప్రత్యేక పాత్రలతోనూ తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బత్త'. బాలాజీ తరుణీతరం దర్శకత్వం వహించిన ఈ సినిమా 1986ల కాలం నాటి మద్రాస్ నేపథ్యంలో సాగే ఒక వెరైటీ గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కింది. ఈ చిత్రంలో మాస్టర్ సాయి పృథ్వీరాజ్, లిజోమోల్ జోస్, అజయ్ ఘోష్, అర్జున్ చిదంబరం కీలక పాత్రల్లో నటించారు. అక్టోబర్ 1న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఈ చిత్రం, ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైనట్లు సమాచారం. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 29 నుంచి స్ట్రీమింగ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడతో పాటు హిందీలోనూ ఒకేసారి ఈ సినిమా అందుబాటులోకి రాబోతున్నట్లు టాక్ నడుస్తోంది. థియేటర్లలో మిస్సయిన విజయ్ సేతుపతి ఫ్యాన్స్, ఈ డిఫరెంట్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను ఓటీటీలో చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఇట్స్ అఫీషియల్..
అనిరుధ్ రవిచందర్-కావ్య మారన్ పెళ్లి డేట్ ఫిక్స్..



కోలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=న) ఓనర్ కావ్యా మారన్ ప్రేమ వ్యవహారం గత కొంతకాలంగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. వీరిద్దరూ త్వరలోనే పెళ్లిపీట ఎక్కబోతున్నారంటూ నెట్టింట ఎన్నో వార్తలు వచ్చినా.. అంతా వీటిని కేవలం రూమర్స్ అని కొట్టేశారు. కానీ, ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా ఈ జోడీకి సంబంధించి ఒక బిగ్ షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. అనిరుధ్, కావ్యా మారన్ పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు తాజాగా అధికారిక సమాచారం వెలువడింది. వీరిద్దరి వెడ్డింగ్ రిసెప్షన్ నవంబర్ 21న చెన్నై వేదికగా అత్యంత వైభవంగా జరగనున్నట్లు తెలంగాణ సీఎంవో (జమీ) స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ గ్రాండ్ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వానాన్ని అందించేందుకు కావ్యా మారన్ తల్లిదండ్రులు స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు.

షాక్‌లో నెటిజన్లు

అలాగే ఓ ఫొటోను కూడా షేర్ చేయడంతో ఈ విషయం కాస్త నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా, వీరి వివాహం విదేశాల్లో జరగనుందని జోరుగా ప్రచారం సాగుతోంది. అందమైన గ్రీస్ దేశంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు ఈ రిలేషన్‌షిప్‌ను గోప్యంగా ఉంచిన ఈ జంట.. ఇప్పుడు ఒక్కటి కాబోతుండటంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. అసలు వీరిద్దరి మధ్య ప్రేమ ఎలా మొదలైందనే దానిపై నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ క్రేజీ న్యూస్ ఇప్పుడు వైరల్ అవుతుండగా.. కొత్త జంటకు సినీ, క్రికెట్ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఆ మగాడిని నేను
ఇప్పటివరకు కలవలేదు..
మృణాల్ ఠాకూర్

టాలెంటెడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ కథలు నచ్చకపోవడంతో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చినప్పటికీ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల 'పూజా మేరీ జాన్' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. షారుఖ్ క్రేజ్, రిలేషన్షిప్స్ విశేషాలను పంచుకున్నారు. షారుఖ్ సార్ నా జీవితంలో లేకపోవడం నా గుండెల్ని ముక్కలు చేస్తోంది. ఆయన సెట్ చేసిన రొమాంటిక్ స్టాండర్డ్స్ గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆయన ఆన్-స్క్రీన్ క్యారెక్టర్లంటే నాకు పిచ్చి. షారుఖ్ అంత రొమాంటిక్‌గా ఉండే మగాడిని నేను ఇప్పటివరకు కలవలేదు" అని చెప్పుకొచ్చారు. ఇక రిలేషన్షిప్స్ ఎలా ఉండాలనే దానిపై క్లారిటీ ఇస్తూ.. కమ్యూనికేషన్ చాలా ముఖ్యమని అన్నారు. భాగస్వాముల మధ్య గొడవలు వచ్చినప్పుడు కాసేపు శాంతించి, ఆ తర్వాత కూర్చుని మాట్లాడుకోవాలని చెప్పారు. ఎవరి ఆలోచనలు వాళ్ళే ఊహించుకోకుండా, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ స్పష్టంగా మాట్లాడుకోవడమే బంధానికి పునాది అని చెప్పుకొచ్చారు. కేవలం లవ్ విషయాల్లోనే కాకుండా.. పేరెంట్స్‌తో కూడా పిల్లలు తమ భావాలను పంచుకోవాలని మృణాల్ అభిప్రాయపడ్డారు. స్నేహితుల కంటే తాను తన తల్లిదండ్రులతోనే ఎక్కువ విషయాలు మాట్లాడుతానని, ఏ సమస్యకైనా కమ్యూనికేషనే అసలైన తాళం చెవి అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం మృణాల్ వ్యాఖ్యలు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737